

# ‘అనంత’ కరువుకు అంతమెప్పుడు?



రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

# ఇలా అడుగుతున్నందుకు కోప్పడకండి

- బి. సూర్యసాగర్

ఈ దేశం గాలినీ ఈ దేశం నేలనీ
ఈ దేశం నదుల్నీ వానల్నీ
ఈ దేశం అడవుల్నీ ఎడారుల్నీ
ఈ దేశం పక్షుల్నీ పువ్వుల్నీ
ఈ దేశం పొలాల్నీ పంటల్నీ
ఈ దేశం సమస్త సౌందర్యాల్నీ
సంపదల్నీ
పంచుకు పుట్టిన వాళ్ళందరినీ
పిలుస్తున్నాను
రండి వినండి
పిలుస్తున్నది రాయలసీమ అని తెలపండి
భయపడకండి
కరువు కన్నీళ్ళ జలపాతమని
దూరంగా తొలగకండి
అప్పుతీర్చలేని ఖాతాదారునిగా
భావించకండి
బాధలతో వచ్చిన బంధువులా
ఎంచకండి

అన్ని ప్రభుత్వాలను
అన్ని పార్టీలను
అన్ని ప్రాంతాల వారినీ
అన్ని భాషల వారినీ
అడుగుతున్నాను

దేశభక్తి అంటే ఏమిటో అడిగినందుకు
చీకాకు పడకండి
గురజాడను గుర్తు చేస్తున్నందుకు
మన్నించండి
దేశ సమగ్రతకు, భద్రతకు అర్థాలు
అడిగినందుకు
దేశద్రోహాన్ని అంటగట్టకండి
ఏ ప్రాంతం వాళ్ళయినా
ఈ దేశం వాళ్ళేనని హామీ
యిచ్చినందుకు
శతకోటి నమస్కారాలు స్వీకరించండి
గంగ, యమున, తుంగభద్ర, కృష్ణ,
గోదావరి
ఇంకా సకల జీవనదులూ
ఈ దేశానివేనా అని అడిగినందుకు
అనవసరంగా అనుమానపడకండి
నదులెలా ఏర్పడుతాయో
ఏ నదిలోకైనా సరే నీరెలా వస్తుందో
పరిశీలించాలనే విజ్ఞప్తిని స్వీకరించండి
వానల్ని ఆయా ప్రాంతాల్లో
ఎలా తయారు చేసుకుంటారని
అడిగినందుకు
అలగకండి

(తరువాయి 3వ కవరుపేజీలో)

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)
ప్రచురణ

# కరువు సమస్యపై

ప్రచురణ కాలం : మే 2017

ప్రతులు : 500

ప్రచురణ : రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

వెల : రూ. 5/-

ప్రతులకు :

మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి
కారల్‌మార్క్స్ రోడ్
విజయవాడ-2

వివరాలకు :

పి.జస్వంతరావు
32-13-26/1, బి.ఎం.ఆర్.రావు.రోడ్
మొగల్‌రాజపురం
విజయవాడ-10

# ముందుమాట

# అనంతపురం జిల్లా
# కరువు పరిశీలన కమిటీ నివేదిక

**గత** 8 సం॥లుగా పంటలు చేతికి రాక, ఈ సంవత్సరమైతే కనీసం పశుగ్రాసం కూడా అందక అనంతపురం జిల్లా రైతు జీవన్మరణ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల ముఖ్యమంత్రివర్యులు కరవు ప్రాంతాలలో రెయిన్ గన్లు సరఫరా చేశామనీ, చెరువులన్నింటినీ నింపామని, కరువుపై యుద్ధంలో ఆవిధంగా ముందుకు పోతున్నామనీ పత్రికలలో పదే పదే ప్రకటనలు గుప్పిస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిశీలించడానికి, ప్రజల ముందుంచడానికీ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో కరువు పరిశీలనా కమిటీ అనంతపురం జిల్లాలోని కొన్ని గ్రామాలకు వెళ్ళి, అక్కడి వ్యవసాయ కూలీలు, రైతులు, చేతివృత్తులు, స్వయం ఉపాధులవారు, వలస శ్రామికుల కుటుంబాలతో మాట్లాడి, వాస్తవ పరిస్థితిని కళ్ళారా చూసి ఈ నివేదికను రూపొందించింది.

2017 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీల్లో అనంతపురం జిల్లాలో పరిశీలన కమిటి పర్యటించింది. (1) ఎస్.ఝాన్సీ – రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) అధ్యక్షులు కన్వీనర్‌గా, (2) సి.పెద్దన్న – ఏఐఎఫ్‌టియు (న్యూ)రాష్ట్ర అధ్యక్షులు (3) ఎస్ఎమ్ భాషా – మానవ హక్కుల వేదిక నాయకులు (4) పురేంద్ర ప్రసాద్ – సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ (5) సూర్యసాగర్ – విశ్రాంత అధ్యాపకులు(6) ప్రసన్న – జనసాహితి (7) బాజీసైదా – పిడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి (8) సింగంనేని నారాయణ – ప్రముఖ కథా రచయిత (9) బి. తిమ్మారెడ్డి – రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ కమిటీలో సభ్యులుగా వున్నారు. కదిరి, రాయదుర్గం ప్రాంతాలలో ఈ బృందం పర్యటించి అనేకమంది రైతులు, రైతుకూలీలు, మహిళలు, దళితులను, ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారందరినీ కలిసింది. వీరిని కలసిన తర్వాత అనేక విషయాలు కమిటీ దృష్టికి వచ్చాయి.

అనంతపురం నుండి కదిరి మీదుగా ప్రయాణిస్తూ – ఒక్కరికి కూడా ఉపాధి కల్పించలేని సోలార్ పవర్ ప్లాంట్లు వందల ఎకరాల్లో విస్తరించి ఉండటాన్ని, బండరాళ్ళతో నిండి ఉన్న ఎగుడు దిగుడు భూముల్ని సైతం తమ శ్రమ శక్తితో సాగులోకి తెచ్చిన రైతు, కూలీల నైపుణ్యాన్ని, బక్కచిక్కిపోయిన పశువుల్ని, కనుచూపు మేరలో పచ్చగడ్డి లేక ఎండుగడ్డి దుబ్బల్ని పీక్కు తింటున్న గొర్రెల్ని, త్రాగడానికి చుక్కనీరు కూడా దొరక్క పక్షిజాతులు ఆ ప్రాంతం నుండి పారిపోయిన పరిస్థితిని, మార్గమధ్యంలో ఎక్కడా నీడనిచ్చే చెట్టు ఒక్కటంటే ఒక్కటి కూడా లేని దుస్థితిని గమనిస్తూ బృందం కోటపల్లికి చేరింది.

కోటపల్లి పంచాయితీలో చిన్నపల్లి, మరాల పల్లి, కొత్తూరు, ఎలుగుంటు తండా, మబ్బులపల్లి, నడిమితండా, గట్టు మీద తండా, దేవళం తండా, రామప్ప కుంట తండా అనే తొమ్మిది గ్రామాలు కూడా కలిసి ఉన్నాయి. కోటపల్లి గ్రామంలో మొత్తం 120

కుటుంబాలు ఉండగా అందులో 60 కుటుంబాలు దళితులే ఉన్నారు. మరో 25 కుటుంబాలు వెనుకబడిన కులాల వారున్నారు. మిగిలిన వారు అగ్ర కులాల రైతు కూలీలు. ఇక్కడ కొద్దిగా స్వంత భూమి కలిగి ఎక్కువ భాగం కౌలు భూమిని కలుపుకుని సాగుచేస్తున్న కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. ఎకరా భూమికి కౌలు వేరుశనగకి రూ3,000/-, ఇతర పంటలకి రూ.1,000/-గా ఉంది.

గత 9 సం॥లుగా అరకొరగానైనా పంటలు చేతికి వచ్చినందున కౌలు చెల్లించామనీ, ఈ సంవత్సరం పెట్టిన పెట్టుబడి మొత్తం మట్టిపాలు అయిపోయిందనీ, అందువల్ల కౌలు కూడా చెల్లించలేక పోయామని రైతులు కమిటీ వద్ద వాపోయారు. కౌలు రైతులకున్న కొద్దిపాటి స్వంత భూమి కూడా డి.కె.టి. భూములు కావడంవల్ల వీరి వద్ద పాస్ పుస్తకాలు లేవు. పెద్ద రైతులను బ్రతిమలాడుకుని వారి పాస్ పుస్తకాలతో ప్రభుత్వం ఇచ్చే విత్తనాల్ని కౌలు రైతులు పొందుతున్నారు. ఇంట్లో ఉండే చిన్న చిన్న బంగారు ఆభరణాలు కుదువపెట్టి పెద్ద రైతులవద్ద అప్పు చేసి వ్యవసాయంలో పెట్టుబడి పెడుతున్నారు. పాస్ పుస్తకాలు లేని కారణంగా ప్రభుత్వం విదిల్చే అరకొర పంట నష్టపరిహారం, పంటల బీమా కూడా వీరికి అందవు.

డి.కె.టి. భూములకు పట్టాలు ఇస్తామని నమ్మించి రైతుల నుండి కొందరు అధికారులు డబ్బులు వసూలు చేయడం, దశాబ్దాలుగా వారిని తమ చుట్టూ త్రిప్పుకోవడం జరుగుతున్నది.

ఈ సంవత్సరం గడ్డి కూడా మొలవక, పశుగ్రాసం లేక, పశువుల్ని అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో వ్యవసాయానికి ట్రాక్టర్ల మీద ఆధారపడాల్సి వచ్చి పెట్టుబడి పెరిగిపోయింది.

కోటిపల్లి గ్రామంలోని 120 కుటుంబాలకు గాను 80 కుటుంబాలు పనికోసం బెంగుళూరు వలస వెళ్ళారు. కృష్ణమూర్తి, బయ్యన్న, రమణప్ప, ఆదెప్ప, సోము, నరేష్, మహేశ్ లాంటి రైతులు కన్న బిడ్డల్ని తల్లిదండ్రుల్ని ఒకరికి ఒకర్ని తోడుగా ఇక్కడే ఉంచి భార్యాభర్తలు పని వెతుక్కుంటూ బెంగుళూరు వెళ్ళారు. ఇలా పనికోసం షిమోగాకు వలస వెళ్ళిన 23 సంవత్సరాల సోమశేఖర్ స్వప్న ఎంటర్ ప్రైజెస్ అనే ఒక కేబుల్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా ఆరు నెలలు పనిచేశాక రోడ్డు ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకుని తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. అతని అసహాయతను అడ్డుపెట్టుకుని ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వకుండానే యాజమాన్యం అతన్ని పంపించేసింది.

స్థానిక ఎం.పి.టి.సి. వెంకటేష్ కూడా వలసపోయి బెంగుళూరులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇలా వలసపోయిన వారు బెంగుళూరులో గార్మెంట్స్ ఫ్యాక్టరీలు, కోళ్ళ ఫారాలు, నిర్మాణరంగంలో, పారిశుద్ధ్య రంగంలో పనిచేస్తుంటారు. బెంగళూరులో ఒక డ్రైనేజి నిర్మాణ పనుల్లో గడ్డపారతో తవ్వుతూ భూగర్భంలోని కరెంటు వైరు మీద గడ్డపార దిగడంతో విద్యుత్ షాక్‌కు గురైన వలస కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు.

స్థానికంగా 20,30 ఎకరాలు భూమి కలిగిన రైతులు సైతం కరువు కారణంగా వలస పోవాల్సిన పరిస్థితిని ఈ ప్రాంతం ఎదుర్కొంటుంది. ఇలా వెళ్ళిన వాళ్ళలో కనీసం 10వ తరగతి పూర్తి చేసినవారు సెక్యూరిటీ గార్డులుగా కాలం వెళ్ళదీస్తున్నారు. రమణా రెడ్డి, శివారెడ్డి, దామోదర రెడ్డి లాంటి పెద్ద రైతుల పరిస్థితి ఇది.

పనుల కోసం వలస వెళ్ళిన వాళ్ళు గతంలో సంవత్సరానికి ఒకసారి రెండుసార్లు స్వంత ఊరికి వచ్చి తల్లిదండ్రులకు, చిన్న పిల్లలకు కావాల్సిన సరంజామా సమకూర్చి వెళ్ళేవారు. ఇప్పుడు రేషన్ బియ్యం ఇవ్వడానికి బయోమెట్రిక్ విధానం అమలులో పెట్టిన తరువాత ప్రతి నెలా సుమారు వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టి బెంగుళూరు నుండి స్వగ్రామానికి వచ్చి రేషన్ బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. బయోమెట్రిక్ యంత్రాలు వయోవృద్ధుల, చిన్న పిల్లల వేలిముద్రలను అంగీకరించక పోవడంతో వెతుక్కున్న పనిని కూడా వదిలిపెట్టి రావాల్సి వస్తున్నది. అలా ఒకటి, రెండు నెలలు రేషన్ బియ్యం తీసుకొనకపోతే రేషన్‌కార్డు రద్దు చేస్తారని, రేషన్ కార్డే లేకపోతే ఇతర ప్రభుత్వ పథకాలేవీ అందవనే భయంతో ప్రతినెలా వచ్చిపోవాల్సి వస్తున్నది. దీనివల్ల కదిరి నుండి బెంగళూరు (ఎలక్ట్రానిక్ సిటీ)కి ప్రతి రోజూ 3 బస్సులు క్రిక్కిరిసి నడుస్తున్నాయి.

ఊర్లో వ్యవసాయం తప్ప మరో పని దొరకదు. కరువుతో వ్యవసాయం మూలన పడింది. ఉపాధి హామీ పథకంలో 3 నెలల క్రితం చేసిన పనికి ఇప్పటికీ బిల్లులు రాలేదు. దీంతో తప్పనిసరిగా వలసపోవాల్సిన స్థితికి ఇక్కడి గ్రామీణ పేదలు నెట్టబడ్డారు. కుటుంబ అవసరాల రీత్యా వలస వెళ్ళని మహిళలకు రోజుకు 100/- కూలికి కూడా పని దొరకదు. ఈ ఊరికి 20 కి.మీ. దూరంలోని అగ్రహారం వరకూ వెళితే నెలకు 3 లేదా 4 రోజులు పని దొరుకుతుంది. గ్రామంలో త్రాగునీరు కూడా దొరకని పరిస్థితిలో సర్పంచ్ తన స్వంత ఖర్చుతో గ్రామానికి త్రాగునీరు అందిస్తున్నాడే తప్ప ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఏదైనా అత్యవసరమైనా కూడా ఊర్లో రూ.200/- కూడా అప్పుపుట్టదు. అలా ఇవ్వగలిగే స్థితిలో కూడా ఎవరూ లేరు. చిన్న పిల్లల్ని తిండి కోసమే అంగన్వాడీలకు పంపుతున్న పరిస్థితి ఉంది.

పెళ్ళికిఅయ్యే ఖర్చులు భరించలేక ఎక్కువశాతం పెళ్ళిళ్ళు గుడిదగ్గర జరుగుతుంటాయి. ఆరోగ్య సమస్యలకు కదిరి, అనంతపురంలలోని ప్రభుత్వాసుపత్రులకు వెళ్తుంటారు.

వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు మంజూరులో రాజకీయ జోక్యం వల్ల ఈ గ్రామంలో అర్హులైనవారు సుమారు 50 మంది పెన్షన్లు పొందలేకపోతున్నట్లు గ్రామస్థులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అనేకసార్లు బోర్లు వేసి నీళ్ళు పడక అప్పులపాలై పెద్ద రైతులు సైతం వలస కూలీలుగా మారిపోయిన పరిస్థితి కరువు తీవ్రతకు అద్దం పట్టింది. 25 ఎకరాల రైతు లక్ష్మి నర్సప్ప ఒక్క ఎకరా భూమిని కూడా సాగులోకి తేలేకపోవడం గురించి చెప్తూ తనకల్లు మండలం మొత్తం ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలియజేశాడు. కోటపల్లి నుండి కమిటీ ముండ్లవారిపల్లె పంచాయతీలోని పెండ్లి గుండు తండాకు వెళ్తుండగా మార్గమధ్యంలో వంద ఎకరాలకు పైగా భూమికి ఒకే ఫెన్సింగ్ వేసి వుండటాన్ని గమనించింది. ఈ విషయమై తండాలోని పెద్దలు మాట్లాడుతూ కరువు వల్ల వ్యవసాయ భూముల ధరలు విపరీతంగా పడిపోయాయని, కాకినాడ నుండి వచ్చిన బంగార్రాజు అనే వ్యక్తి తమ తండాకు ఆనుకుని ఉన్న 100 ఎకరాలను రైతుల వద్ద నుండి కొన్ని ఫెన్సింగ్ వేశాడనీ, ఆ ఫెన్సింగ్ వల్ల తమ తండాకి తరతరాలుగా ఉన్నదారి మూసుకుని చేలలోంచి, చెట్లలోంచి నడిచి వెళ్ళాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు బంగార్రాజు తమ తండా వారిని కూలి పనికి పిలవడం మానుకున్నాడని

వివరించారు. ఇదే విధంగా మండలంలోని మరో గ్రామంలో దాదాపు 250 ఎకరాల భూమిని సోలార్ పవర్ ప్లాంట్‌గా మార్చారని, దాని యజమాని హెలికాప్టర్‌లో వచ్చి వెళ్తుంటాడని తెలియజేశారు. గతంలో భూస్వాముల వద్ద వందల ఎకరాలు పోగుపడి ఉన్నప్పుడు పేద రైతు కూలీలు పోరాడి భూములు సాధించుకున్న పరిస్థితి నుండి కరువు వల్ల చిన్న, సన్నకారు రైతులు భుక్తి కోసం భూములు అమ్ముకుంటున్న కారణంగా భూమి తిరిగి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కేంద్రీకరించబడటాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు. ఈ విధంగా మండలం మొత్తం మీద సుమారు 3 వేల ఎకరాలు చేతులు మారినట్లు స్థానికుల అంచనా.

ఈ తండాలో మొత్తం 25 కుటుంబాలు - సుగాలీలు ఉన్నారు. వీళ్ళందరికీ 1 నుంచి 3 ఎకరాల వరకు స్వంత భూమి ఉంది. నిత్య కరువు కారణంగా ఆ భూముల మీద ఆధారపడకుండా వీళ్ళు గతంలో ఆవుల్ని పెంచేవాళ్ళు. గత 20 సం॥లుగా ఆవులకు సరిపడా మేత లేనందున వాటిని తెగనమ్ముకుని ప్రస్తుతం గొర్లు మేపుకుంటున్నారు. తండాలో మొత్తం 500 గొర్లు ఉన్నాయి. వీటిని మేపి పిల్లల్ని 3 నెలల వయసులో చేలూరు (కర్నాటక) సంతలో అమ్ముతుంటారు. గొర్లకు నీళ్ళ కోసం ప్రతి రోజూ ఎంతో దూరం తోలుకు పోవాల్సి వస్తుంది. తండాలో మనుషులు తాగడానికే నీళ్ళు లేని పరిస్థితి. తాగు నీటికి, ఇంట్లో వాడుకునే నీటికి 1.5 కి.మీ. దూరంలోని భూలే నాయక్ తండా నుండి మోసుకురావాల్సిందే. ప్రభుత్వం వారు తండాలో సోలార్ బోర్లు వేశారు. అవి రాత్రి పనిచెయ్యవు. పగలు కూడా అడుగంటిన భూగర్భ జలాలను తోడటానికి వాటి శక్తి చాలదు.

పక్కనే ఉన్న దందోలుపల్లి, పెద్దపల్లి గ్రామాల రైతులు ఎకరం రూ.500/- కౌలుకి భూమి ఇస్తారు. ఎప్పుడైనా ఒక చినుకు పడితే ఆశతో 2-3 రూపాయల వడ్డీకి తెచ్చి పెట్టుబడిపెట్టి వ్యవసాయం చేసి చేతులు కాల్చుకుంటుంటారు. విత్తనాలు కొనడం, ట్రాక్టర్ల వాడకం వల్ల వేరుశనగకు ఎకరానికి రూ20,000/- పెట్టుబడి ఔతుంది. డి.కె.టి. భూములు, పట్టాదార్ పాస్ పుస్తకాలు లేనందున బ్యాంకులు లోన్లు ఇవ్వవు. ఈ తండాలో ఎవరికీ వృద్ధాప్య పెన్షన్లు కూడా రావు. స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన ఇళ్ళలో సుగాలీలు నివాసం ఉంటున్నారు. తండాకి విద్యుత్ సరఫరా కూడా స్వచ్ఛంద సంస్థలు చేసిన ఏర్పాటే. ప్రభుత్వంవారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని తండా వాసులు తెలియజేశారు. తండాలో కొద్దిమేర చదువుకున్న పిల్లల్ని వలస శ్రామికులుగా బెంగుళూరు పంపుతున్నారు. వాళ్ళు అక్కడ హౌస్ కీపింగ్ పనులు చేస్తుంటారు. పనుల పేరుతో కొంతమంది కేరళ వెళ్ళి అక్కడ యాచకులుగా బ్రతుకుతున్నట్లు కూడా కమిటీ దృష్టికి వచ్చింది.

చీకటిమానుపల్లె పంచాయితీలోని ఏడు గ్రామాలలో పడమటి వాని పల్లె ఒకటి. ఇక్కడ మొత్తం 90 కుటుంబాలు ఉన్నాయి. 40 సం॥ల క్రితం చుట్టుపక్కల అన్ని ఊర్లలోని కూలీలు ఈ ఊరు వచ్చి పనిచేసుకుని బ్రతికేవాళ్ళు. ఒక్కో ఇంటికి 2 కాడులు (4) ఎడ్లు ఉండేవి. మేత లేక ఎడ్లను అమ్ముకుని పెట్టుబడి ఎక్కువైనా ట్రాక్టర్ సేద్యం చేయ్యాల్సి వస్తుంది. కొంత మంది గొర్లు మేపుతున్నా వాటికి కూడా మేత, నీళ్ళు కరువై ప్రతిరోజూ సుదూర ప్రాంతాలకు తోలుకుపోయి రావాల్సి వస్తుంది.

చుట్టుప్రక్కల గ్రామాలకు ఆధారంగా నిలబడ్డ ఊరు నుంచి ఇప్పుడు పులివెందుల, చింతామణి, పలమనేరు, పుంగనూరు వరకు రోజు కూలీలుగా వెళ్ళి బ్రతకాల్సి వస్తుంది. గ్రామంలోని మహిళలు ఉదయం 6 గంటలకు వెళ్ళి రాత్రి ఒంటి గంటకు ఇంటికి చేరుతున్నారు. 19 గంటల పనికి 250/- కూలీ దక్కుతుంది. మామూలుగా కూలీ రూ.100/- మాత్రమే.

ఈ ఊర్లోని రైతులందరూ తమకున్న 3-10 ఎకరాల స్వంత భూమిలో సాగు చేసేవాళ్ళే. కూలి చేసి, అప్పుచేసి వ్యవసాయంలో పెట్టుబడి పెడుతుంటారు. 10 ఎకరాల రైతుకు 4 లక్షల అప్పు సాధారణంగా ఉంటుంది. అందులో కేవలం 25% మాత్రమే బ్యాంకుల్లో ఉంటుంది. మిగిలిన 75% ప్రైవేటు వ్యాపారుల దగ్గర అప్పు చేస్తుంటారు. ఒక్కోరైతు సగటున 6 బోర్లు వేశారు. బోర్లలో నీళ్ళు రాక అప్పులపాలై భూములు పోగొట్టుకుంటున్నారు. గ్రామంలోని యువకులు అధిక భాగం బెంగుళూరులో వలస శ్రామికులుగా ఉన్నారు. బి.టెక్ చదివిన కుర్రాళ్ళు కూడా వ్యవసాయం చేస్తున్నారు. ఊరు మొత్తంలో ఒక్కరు కూడా కనీసం ప్రైవేటు రంగంలోనైనా స్థిరమైన ఉద్యోగం చేసేవారులేరు. గత 10 సం॥లుగా ఊర్లో ఒక్క కొత్త ఇల్లు కూడా కట్టలేదు.

4 సం॥లుగా పంటలు లేవు. వరుసగా వేరుశనగ, టమోట, దోస, మొక్కజన్న వేయడం - నీళ్ళు లేక అవి ఎండిపోవడం ప్రతి సంవత్సరం జరిగే తంతే. 1000 అడుగుల వరకూ కూడా బోర్లు వేసి విఫలమైన రైతులు చాలా మందే ఉన్నారు. మంచినీటికి కూడా కిలో మీటర్ దూరంలోని ఎద్దల వారి పల్లె నుండి మోసుకోవాల్సిన పరిస్థితి. ఈ గ్రామంలోని బయ్యారెడ్డి అనే రైతు 900 అడుగల లోతు బోర్ వేయగా అందుకు బిల్లు 300 అడుగల వరకూ అడుగుకు రూ.80/-, 400 వరకు 90/- ఇలా పెరుగుతూ 900 అడుగుల వద్ద అడుగుకు రూ.220/- చొప్పున మొత్తం బిల్లు - 1,11,000/- అయింది. ఈ ప్రాంతంలో ఇది ఒక ఎకరం భూమి విలువకు సమానం. ఎక్కడైనా ఒక్క చోటైనా నీళ్ళు పడకపోతాయా? అనే ఆశతో రైతులు పదే పదే బోర్లు వెయ్యడం, అప్పులపాలై భూములు పోగొట్టుకోవడం అనంతపురం జిల్లా నిండా కన్పించే సాధారణ దృశ్యం.

తనకల్లు మండలంలోనే ఉన్న ఈతోడు గ్రామంలో మొత్తం 350 కుటుంబాలు ఉండగా వారిలో అగ్రకులాలు - 120, దళితులు - 100, వెనుకబడిన కులాలు - 130 ఉన్నారు. ఇక్కడ ప్రధానంగా స్వంత భూములలోనే వ్యవసాయం జరుగుతుంది. దళితులు కొంతమంది కౌలు సేద్యం చేస్తారు. ఊళ్లో మాగాణి 300 ఎకరాలుంది. కానీ నీళ్ళు లేక బీడుపెట్టారు. గతంలో తీసుకున్న ఋణాలలో 30% మాఫీ అయ్యాయి. ప్రస్తుతం బ్యాంకులు లోన్లు ఇవ్వడం లేదు. అందువల్ల ప్రైవేటు వ్యాపారుల వద్ద రూ.3/- వడ్డీకి తెచ్చి వ్యవసాయం చేస్తున్నారు. 4-5 నెలల నుండి బోర్లు ఎండిపోయి జన్న, టమోట, ఆనప ఏదీ చేతిక రాలేదు. రెయిన్ గన్ల కోసం చాలాసార్లు కలెక్టర్‌ని కలిసినా ఫలితం లేదు. పంటలు ఎండిపోయాక రెయిన్ గన్లు ఇచ్చారు.

గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా గెలిపించుకున్న సర్పంచ్ 25 ఎకరాల స్వంత భూమిని వదిలేసి బెంగళూరు వలస పోవాల్సి వచ్చింది. అక్కడున్న ఈ గ్రామస్థులు ఆయన్ని పని చెయ్యనియ్యకుండా త్రిప్పిపంపడం జరిగింది. సదరు సర్పంచ్ కమిటీతో మాట్లాడుతూ

హంద్రీనీవా కాలువ సి.ఆర్. పల్లి నుండి ఈతోడు మీదుగా సి.జి. ప్రాజెక్టుకు కలిపే విధంగా గతంలో సర్వే చేసి అంచనాలు కూడా తయారు చేశారని, అధికార పార్టీలోని రఘునాథరెడ్డి, ప్రతిపక్షంలోని మోహనరెడ్డి కుమ్మక్కై మాకు రావాల్సిన కాలువను 20 కి.మీ. దూరం పెంచి వాళ్ళ గ్రామాలకు తీసుకెళ్ళిన కారణంగానే ఈతోడు బీడై పోయిందని, గతంలో సర్వే చేసిన మార్గంలో కనీసం ఒక సబ్ కెనాల్ ఇచ్చినా ఊరు బాగుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాల్వకు లిఫ్ట్ కూడా లేకుండా గ్రావిటీతోనే నీరు పారుతుందని తెలిపారు.

రాయదుర్గం ప్రాంతంలోని గుమ్మగట్ట మండలం పూలకుంట గ్రామంలో దళితులు - 100 కుటుంబాలు, బి.సి.లు - 650 కుటుంబాలు, ఒ.సి.లు - 60 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో 80% వలసపోవడం జరిగింది. వలసపోయిన వారిలో అన్ని కులాల వారు ఉన్నారు. గ్రామంలో 15 ఎకరాల భూమి కలిగిన బడిగె గంగప్పకు 5 లక్షల రూపాయల అప్పు ఉంది. ఈ సంవత్సరం 90 వేల రూపాయలు పెట్టుబడిపెట్టి వేరుశనగ సాగుచేస్తే మొత్తం 60 కె.జి.లు దిగుబడి వచ్చిందని, అప్పుల వాళ్ళకు భయపడి తప్పించుకు తిరుగుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక్కడ నుండి వలస వెళ్ళిన వాళ్ళు బెంగళూరులో పట్టల కొష్టాలలో ఉంటూ, అక్కడ ఉండటానికి అనుమతి ఇచ్చిన వాళ్ళ చెప్పు చేతల్లో బతకాల్సివస్తుందని తెలిపారు. ఈయన 600 అడుగుల లోతుకు 3 బోర్లు వేసినా చుక్కనీరు కూడా రాని పరిస్థితి.

ఈ ఊర్లో ఆగస్ట్ నెలలో జరిగే మారెమ్మ పండుగకు బెంగళూరు పోయి ఉగాదికి తిరిగివస్తారు. ఊర్లో త్రాగడానికి కూడా నీరు లేదు. సర్పంచ్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాడు. ఋణ మాఫీ పత్రాలు ఇచ్చారు. బ్యాంకుల్లో జమకాలేదు. ప్రభుత్వం పథకాలు ఏమైనా ఉంటే వాళ్ళ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారు. ఇదేమిటని జన్మభూమి సభలలో ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు.

వలసపోయిన వాళ్ళు బెంగుళూరులో సిమెంటు పనికి, పెట్రోల్ బంకులలో పనికి కుదురుతుంటారు. నెలకు రూ.7,000/- జీతం వస్తే రూ.1,500/- అద్దె కట్టాల్సి వస్తుంది. అన్ని ఖర్చులు పోను సంవత్సరం మొత్తం మీద మిగిల్చిన 20-30 వేలు మారెమ్మ పండుగకు, ఊర్లో ఉన్న ముసలివాళ్ళ భుక్తికి చాలదు. వలసపోయిన ఆడవాళ్ళు బెంగుళూరులో ఆయాలుగా, హౌస్ కీపింగ్ పనులు, పారిశుధ్య పనులు చేస్తుంటారు. ఇన్ని బాధలు పడుతూ నెలకొకసారి రేషన్‌షాప్‌లో (బయోమెట్రిక్) వేలిముద్రల కోసం సుమారు నెలకు రూ.1,000/- ఖర్చు పెట్టుకుని వచ్చిపోవాలి. లేదంటే కార్డు రద్దయితే ఊర్లో దేనికీ చెల్లమని భయం.

ఉపాధి హామీ పనులకు వెళ్తే నేల గట్టిదనం కారణంగా చేతులు ప్రతిరోజూ రక్తంతో తడవాల్సి ఉంటుంది. గడ్డపారలు కూడా వారానికి 2 సార్లు పదును చెయ్యాల్సి వుంటుంది. ఇంత చేసినా రోజుకు రూ.50/- కూడా కూలీరాదు.

బ్యాంకు లోన్లు రాని కారణంగా 2/- వడ్డీకి తెచ్చి వ్యవసాయం చేస్తున్నారు. వడ్డీలు తీర్చడానికి కూడా పంట రావడం లేదు. ఊర్లో రాజశేఖర రెడ్డి అనే రైతు 500-650 అడుగుల లోతుకు ఎన్నో బోర్లు వేసినా ఫలితం శూన్యం. ప్రభుత్వం ఇందిరమ్మ

ఇల్లు మంజూరు చేస్తే దాన్ని పూర్తి చేయడానికి 6 ఎకరాలు అమ్మాల్సి వచ్చిందనీ, ఫెయిలైన బోర్ల వల్ల 30 ఎకరాల నుండి 5 ఎకరాలకు చేరుకున్నామనీ, ప్రస్తుతం కుటుంబం మొత్తం బెంగళూరు వెళ్ళి పనులు వెతుక్కుంటున్నామని తెలియజేశాడు.

గుమ్మఘట్ట మండలంలోని గోనబావి గ్రామంలో దళితులు - 350, బి.సి.లు - 1,300, ఒ.సి.లు-100 కుటుంబాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో ఎక్కడ బావి తవ్వాలన్నా ఈ గ్రామానికి చెందిన వడ్డెర కులస్థుల్నే పిలిచేవారు. భూగర్భజలాలు అడుగంటడంతో ప్రస్తుతం వీళ్ళు ఉపాధి కోల్పోయి బెంగుళూరు వలస వెళ్తున్నారు. బెంగుళూరుతోపాటు కొంతమంది తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వెళ్ళేవాళ్ళు కూడా ఉన్నారు.

వీళ్ళకు స్వంత భూమిలేదు. కొద్ది పాటి భూమి ఎవరికైనా ఉన్నా సాగునీరు లేదు. పది సం॥లుగా పంటలు లేవు. ఫలితంగా వలసలు తప్పటం లేదు. బి.టి. ప్రాజెక్ట్‌లో నీళ్ళు లేని కారణంగా ఈ ప్రాంతంలో వ్యవసాయం కుంటుపడింది. నీళ్ళు అందుబాటులో ఉంటే వరి బాగా పండే ప్రాంతమది. 60 అడుగులు త్రవ్వినా బోర్లలో నీరుపడని కారణంగా త్రాగునీరు 3 రోజులకు ఒకసారి 5-6 బిందెలు మాత్రమే వస్తాయి.

ఉపాధి హామీ పనికి వెళ్తే బిల్లులు 5,6 నెలలకు ఒకసారి వస్తున్నాయి. అవి కూడా మండల కేంద్రంలో ఉన్న బ్యాంకుకు వెళ్ళి తెచ్చుకోవాలి. రేషన్ బియ్యం కోసం, ఉపాధి హామీ పనికోసం ప్రభుత్వం నెలకొకసారి జెరాక్స్‌లు అడగటం, మీ సేవకు వెళ్ళాల్సి రావడం అదనపు భారంగా ఉంది.

ఉద్యోగాలు ఎలాగూ రావు కాబట్టి 8,9 తరగతులవద్దే చదువు మాన్పించి పిల్లల్ని కూడా వలస కూలీలుగా మార్చి పనులకు తీసుకువెళ్తున్నారు. బి.టి. ప్రాజెక్ట్‌లో నీళ్ళు ఆగిపోయాక ప్రతి సంవత్సరం వలస పోవడం వీళ్ళ జీవన విధానంలో భాగమైంది. వ్యవసాయం కోసం, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చలేక మరికొంత గడువు ఇవ్వమని షావుకార్లను బ్రతిమలాడుకుని రోజులు గడుపుతున్నామని చెప్పారు.

ఇక్కడ జనం ఎదుర్కొంటున్న కరువు సమస్య నుండి తక్షణ ఉపశమనం కోసం ప్రభుత్వం క్రింది చర్యలు చేపట్టాలని కమిటీ డిమాండ్ చేస్తున్నది.

1. అనంతపురం జిల్లాలోని 63 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినందున జిల్లాలోని ప్రతి కుటుంబానికీ త్రాగునీరు, ఆహారం, ఉపాధి, పశుగ్రాసం అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.
2. ప్రజా పంపిణీ వ్యవస్థలో, సామాజిక భద్రతా పెన్షన్లలో బయోమెట్రిక్ వ్యవస్థను రద్దు చేయాలి.
3. భూగర్భ జలాలు అడుగంటి ప్రభుత్వం చేత బ్లాక్ ఏరియాలుగా ప్రకటించబడ్డ ప్రాంతాలలో రైతులలో విస్తృత ప్రచారం చేసి ప్రత్యామ్నాయాన్ని అందించాలి. భూగర్భంలో చుక్క నీరు కూడా లేనిచోట్ల బోర్లు వేసి రైతులు అప్పుల పాలవ్వడాన్ని ప్రభుత్వం నిలువరించాలి.
4. రైతుల ఆత్మహత్యల నివారణకి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ని నియమించి సహాయచర్యలు చేపట్టాలి.

5. తర్బూజా విత్తనాలు కేజి రూ.35,000/- అమ్ముతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ పెట్టుబడి పంటల్ని ప్రోత్సహించాలి.
6. ప్రభుత్వం ప్రకటించిన వాటర్‌గ్రిడ్‌ను వెంటనే పూర్తిచేసి ప్రతి గ్రామానికీ త్రాగునీటి భద్రత కల్పించాలి.
7. ఉపాధి హామీ పథకం వేతనాలు ప్రతివారం, నగదు రూపంలో చెల్లించాలి. కరువు ప్రాంతాలలో పని దినాలు, కూలీరేట్లు పెంచాలి.
8. హంద్రీనీవా ద్వారా చెరువులన్నింటినీ నింపాలి.

అంతేకాకుండా మరో 4,5 సంవత్సరాలు ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రాంతం ఎడారిగా మారిపోయే ప్రమాదాన్ని గుర్తిస్తూ సాగునీటికి ఉన్న అన్ని అవకాశాలనూ సద్వినియోగం చేస్తూ ప్రణాళికను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేయాలి. అనంతపురం జిల్లాలో కరువుకు, వలసలకు కారణమైన సాగునీటి సమస్యను ప్రభుత్వం తన ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. గింజ దిగుబడి రాని పరిస్థితుల్లో కూడా రైతులకు పంటల భీమా అందించని బజాజ్ అలియాంజ్ కంపెనీ మీద చర్యలు తీసుకుని, రైతుల ప్రైవేటు ఋణాలపై కూడా మారటోరియం ప్రకటించాలి – అని కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

“వర్షాలు లేని అనంతపురంతోపాటు, పుష్కలంగా వర్షాలు కురిసే శ్రీకాకుళం జిల్లాలో కూడా కరువు తాండవమాడటంలో పాలకుల ఉద్దేశ్యపూర్వక, కుట్రపూరిత దుర్నీతిని అర్థం చేసుకుని కరువు నుండి, వలసల నుండి విముక్తికి రైతులు, కూలీలతో సహా సమస్త ప్రజానీకం సమైక్యంగా పోరాడాలి” అని ప్రజలకు పిలుపునిస్తున్నది.

# పంటకుంటలే అనంత నీటి కరువును తీరుస్తాయా?

- **యస్.యం.బాషా,** మానవ హక్కుల వేదిక

ఏప్రిల్ 20 వ తారీఖున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తనపుట్టిన రోజుపండుగను అనంతపురం జిల్లాలో జరుపుకున్నారు.ముఖ్యమంత్రిగారికి, తెలుగు తమ్ముళ్ళకు పండుగ వాతావరణం వుండి వుండవచ్చుగానీ, అనంతపురంపట్టణం తప్ప జిల్లా మొత్తం తీవ్రమైన తాగునీటికొరతతో అల్లాడుతున్న ప్రజానీకానికి మాత్రం నిస్సందేహంగా పూర్తిగా నిరాశాజనకంగానే ఉండిపోయింది. తాగునీటిని గురించి ఒక్కమాట కూడా మాట్లాడకుండా పొలాల్లో వర్షపునీరు నిల్వచేయడానికి పంటకుంటలు తవ్వుకోమని ఉచిత సలహా చెప్పి వెళ్ళిపోయాడు. పంటలు పండక, తాగడానికి నీళ్ళు లేక, ఉపాధి లేక, పసిబిడ్డల్లా పెంచుకున్న పళ్ళతోటలు కళ్ళముందే నిట్టనిలువునా ఎండిపోతుంటే ఇటువంటి వాతావరణంలో పుట్టినరోజుపండుగ అంటూ కేకులు కట్‌చేసుకోవడం ఒక క్రూయల్ జోక్.

## ఏమిటీ పంటకుంటలు?

రైతులకు ఇష్టమున్నా లేకపోయినా బలవంతంగా పొలాల్లో చిన్నచిన్న కుంటలు తవ్వారు.గతసంవత్సరం అనంతపురం జిల్లాలోనే 54,272 పంటకుంటలు తవ్వినట్లు ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఇందుకోసం 135.29 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారు. మరో 24,909 కుంటలు ఇంకా పూర్తి కావలసివున్నాయి. గ్రామాలలోని రైతులు చెబుతున్నదేమంటే, వర్షాలు వచ్చి నీరు ప్రవహిస్తేనే కుంటలు నిండుతాయి. వర్షాలు రావడంలేదు. పైగా 1-2 సంవత్సరాలలోనే గాలికి, వానలకు, పశువులు తొక్కి కుంటలు పూర్తిగా పూడిపోతాయి. వాటికి ఇంతడబ్బు ఖర్చుపెట్టే దానికన్నా, ఏదైనా శాశ్వతపనులు చేపట్టవచ్చుగదా అని అడుగుతున్నారు. ఈ సంవత్సరం ఒకలక్ష పంటకుంటలు తవ్వుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దప్పిక తీర్చమని అడిగిన వానికి బావితవ్వుతానని చెప్పినట్లుంది. ప్రజలు మెచ్చని,రైతులు కోరుకోని ఈ పంటకుంటలను ప్రభుత్వం ఎందుకు బలవంతంగా రుద్దుతోంది? పోనీ గతంలో నిర్మించిన వాటర్‌షెడ్లు గానీ, పంటకుంటలవల్ల గాని ఏమైనా భూగర్భ జలాల పరిస్థితిలో మార్పువచ్చిందా? అంటే లేదని అనుభవాలు చెబుతున్నాయి. రాజకీయ నాయకులకు అధికారులకు ఉపాధి కల్పించడం తప్ప గ్రామాల పరిస్థితిలో మార్పులు రాలేదు.

పంటకుంటల తవ్వకాన్ని గ్రామీణ ఉపాధిపథకంలో చేర్చడంవల్ల, కేంద్రప్రభుత్వం నిధులు సమకూర్చే ఈ పథకం ద్వారా ఒక అధికారపార్టీ ఎం.ఎల్.ఎ తన నియోజక వర్గంలో జెసిబిలతో పనులుగావించి, బిల్లులు తనకు తెచ్చిఇవ్వమని అధికారులకు హుకుం జారీచేశాడు. పనులు కోరే కూలీలనోట్లో మన్ను కొట్టడమే కాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాలలో పచ్చచొక్కాల కార్యకర్తలకు పనులు ఇవ్వడం ద్వారా వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఆలోచన ముఖ్యమంత్రిగారిది. ప్రజలబాధలు, కష్టాలు రాజకీయనాయకుల పెట్టుబడులుగా మారడం అంటేఇదే.

## తీవ్రమైన తాగునీటికొరత

గతంలో వేసవికాలంలో గ్రామాలలో మాత్రమే తాగునీటికి కొరత ఏర్పడేది. పట్టణాలకు ఏర్పాటుచేసిన తాగునీటి సరఫరా పథకాలవల్ల పెద్దగా సమస్య అనిపించేదికాదు. ఈ మంచినీటి పథకాలన్నీ నదీగర్భాలలో వేసిన బోర్లవల్ల ప్రజల దాహార్తి తీరేది. జిల్లాలో ప్రవహించే ముఖ్యనదులు పెన్నా, చిత్రావతి, హగరి నదీగర్భాలే ఎండిపోవడంవల్ల, ఈపథకాలన్నీ మూలనపడినాయి. ఏప్రాంతంలో అయినా నదీగర్భాలు ఎండిపోవడం తీవ్రమైన పరిణామాలను తెలియజేస్తుంది. ఈ నదులలో వర్షపు నీరు ప్రవహించకపోవడంతోపాటు, అధికారపార్టీల నాయకులు ఇసుకను పూర్తిగా తోడివేయడం వల్ల ఈ ప్రమాదకర పరిస్థితి ఏర్పడదానికి మరోకారణం. ఈరోజున ఈ నదుల రూపురేఖలే మారిపోయినాయి. కంపచెట్లు పెరిగినాయి. తెలిసినవాళ్ళకు మాత్రమే ఇక్కడ నది ఉండేదని తెలియవస్తుంది. పెన్నానది ద్వారా సమృద్ధిగా తాగునీరు పొందే తాడిపత్రి, పామిడి లాంటి పట్టణాల్లో 4-5 రోజులకు ఒకసారి కూడా నీరు దొరకడం లేదు. నందమూరి బాలకృష్ణగారు ప్రాతినిధ్యం వహించే హిందూపురం పట్టణంలో 15 రోజులకు ఒక్కసారికూడా బిందెడు నీళ్ళు దొరకడం లేదు. బెంగుళూరు ప్రభావం వల్ల ఈపట్టణంలో ఇంటి అద్దెలెక్కువ. ఇంటి అద్దెలతో సమానంగా నీటికోసం డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తున్నది.

హిందుపురంలో తాగునీటి సమస్య ఎంత తీవ్రంగా మారిపోయిందంటే, ఈమధ్యనే వైయస్ ఆర్ సిపి నాయకులు ర్యాలీకి పిలుపిస్తే ప్రజలు వందలాదిగా ఖాళీబిందెలతో ప్రదర్శన చేశారు. జిల్లాలో దాదాపు 400-500 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరపరా చేయడం జరుగుతున్నది. ఈ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు కలుషితంగా వుండడంవల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ట్యాంకర్ల సరఫరాల్లో రాజకీయనాయకుల, అధికారుల చేతివాటం వల్ల నీటి సరసరా ఒక ప్రహసనంగా మారిపోతోంది. జిల్లాలో సారాయి వ్యాపారం తర్వాత నీటి వ్యాపారం రెండవ స్థానం ఆక్రమించింది. జిల్లాలోవున్న అన్ని పురపాలకసంఘాలలో నీటిఎద్దడి కొనసాగుతూనే వున్నది. ఈ పురపాలక సంఘాలలో తాగునీటికోసం 1952 బోర్లువుంటే అందులో 522 పూర్తిగా ఎండిపోయినాయి. మిగిలిన వాటిలో అరకొర నీరు రావడమో లేదా తాగడానికి పనికి రాకపోవడమో జరుగుతున్నది. ఒక్క తాడిపత్రి పట్టణంలోనే ఉన్న 343 బోర్లలో 240 బోర్లు ఎండిపోయినాయి. ఇకగ్రామాల పరిస్థితి అయితే సరేసరి. చాలాగ్రామాలలో మొత్తం బోర్లు అన్నీ ఎండిపోయినాయి. ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

## నిలువునా ఎండిపోతున్న పళ్ళతోటలు

జిల్లావ్యాప్తంగా 4 లక్షల 28 వేల ఎకరాల విస్తీర్ణంలో 22 రకాల పళ్ళతోటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా ఒక లక్షా 10 వేల ఎకరాల్లో చీనీ (బత్తాయి) ఒక లక్ష ఎకరాల్లో మామిడి, ఉన్నాయి.వీటన్నింటికీ బోర్లద్వారానే నీటి ఆధారం. ఒక్కొక్క రైతు అయిదు బోర్ల నుంచి 10-15 బోర్లన్నా వేసివుంటాడు. ఈ ఎండా కాలానికి బోర్లలో నీళ్ళులేక దాదాపు 10 వేల ఎకరాల్లోని చీనీతోటలు, 5 వేల ఎకరాల్లో మామిడి, మరో 2 వేల ఎకరాల్లో ఇతర పళ్ళతోటలు ఎండిపోయినాయి. పసిబిడ్డల్లా సాకుతున్న పళ్ళు తోటలు నిట్టనిలువునా ఎండిపోతుంటే రైతుల అవస్థలు, అనుభవిస్తున్న కడుపుకోతలు అంతా ఇంతాకాదు. ఎండిపోతున్న పళ్ళతోటలను కాపాడుకోవటానికి రైతులు మరిన్ని అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. 1200 అడుగుల నుంచి 1500 అడుగులు పోయినా చుక్క నీరు పడకపోతే ఎండిపోయిన తోటలివి. మరికొంతమంది ట్యాంకర్ల ద్వారా నీరుతోలించి చెట్లను ఎండిపోకుండా కాపాడుకుంటున్నారు. నెలకు ఎకరాకు 10-15 వేలు ఖర్చుపెడుతున్నారు. ఈరకంగా తడులిచ్చిన చెట్లు కాయలుకాయవు. కేవలం ఎండిపోకుండా కాపాడుకోవడం అంతే. ఈసంవత్సరం పళ్ళతోటలకు రక్షక తడులు ఇవ్వడానికి 42 కోట్లు మంజూరు చేయవలసిందిగా జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి మార్చి మాసంలోనే నివేదిక పంపింది. ఇంతవరకూ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినాలేదు.

## అడుగంటిపోయిన భూగర్భజలాలు

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయిన 100 గ్రామాలను ఎంపిక చేస్తే, అందులో 24 గ్రామాలు ఈ జిల్లాలోనివే. తాగునీటి కొరత ఎదుర్కొనేందుకు ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖ 200 కోట్లు కెటాయించమని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే ప్రభుత్వం 32 కోట్లు మాత్రమే ఇస్తానని చెప్పింది. అధికారులు ప్రకటించిన లెక్కల ప్రకారమే 2 లక్షల వేల వ్యవసాయ బోర్లున్నాయి. ఇందులో 87,574 బోర్లు పూర్తిగా ఎండిపోయినాయి. జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 26.5 మీటర్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఉన్నటువంటి 63 మండలాలల్లో 44 మండలాలల్లో భూగర్భ జల లభ్యత పూర్తిగా అడుగంటి పోయింది. గతఏడాది 520 మి.మీ. వర్షాపాతం (సాధారణవర్షాపాతం) రావాల్సి ఉండగా కేవలం 290 మి.మీ. వర్షాపాతం మాత్రమే నమోదయింది. గత డిశెంబరులో సగటు భూగర్భ జలమట్టం 20 మీటర్లు ఉంటే, ఈ జనవరిలో 22 మీటర్లు, ఫిబ్రవరిలో 23 మీటర్లుకు పడిపోయి ఏప్రిల్ మాసానికి 27 మీటర్లకు చేరుకునింది. ఇక రాబోయే 2-3 నెలల్లో ఏమేరకు పడిపోతాయోనని రైతుల ఆందోళన. రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 13.99 మీటర్లు ఉండగా, అధమస్థానంలో అనంత 27 మీ.గా కొనసాగుతున్నది. ఈ సందర్భంలోనే ఎండలు 45 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఈ ఎండల వేడికి ఎక్కడైనా నీటి జాడలుంటే వేగంగా ఆవిరి అవుతున్నాయి. అందుకే అనంతపురం జిల్లా నీటిలభ్యత విషయంలో ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇటువంటి పరిస్థితులలో ముఖ్యమంత్రి తీవ్రమైన సమస్యల గురించి ప్రస్తావించకుండా పుట్టినరోజు పండుగ చేసుకోవడం వుండుమీద కారం చల్లినట్లుగా వుంటోంది.

## అసలు అనంతపురం జిల్లాకు కరువులెందుకువస్తున్నాయి?

సాధారణంగా ఏప్రాంతంలోనైనా వర్షాధార పంటలు పండటానికి కనీసంగా 700 - నుంచీ 900 మి.మీ. వర్షాపాతం అవసరమని శాస్త్రజ్ఞులు చెబుతారు. లభ్యమవుతున్నటువంటి లెక్కలప్రకారం సగటు వర్షాపాతం 520 మి.మీ అటుగా, ఇటుగా ఉంటోంది. అయితే ప్రకృతి సంక్షోభం వల్ల వర్షపుదినాల సంఖ్య తగ్గిపోతూ వుండడం, జనాభా అవసరాలకు అధికంగా భూగర్భ జలాల మీద ఆధారపడడం పెరిగిపోయింది. వర్షాపాతం లేక అడవులు అభివృద్ధి చెందలేదు. 1975 నుంచీ అటవీశాఖ వారు జిల్లాలో సోషియల్ ఫారెస్ట్రీ పేరుతో వేలకోట్లు ఖర్చుపెట్టినా, ఇంతవరకూ వాటి ఆనవాళ్ళు కూడా కనపడవు.పచ్చదనం లేకపోవడం చేత గాలివేగం పెరగడం, భూతాపం పెరగడం మూలానా కురిసేవర్షం నేలమీదపడకనే ఎక్కువగా ఆవిరయిపోతున్నది. పడే వర్షాపాతం 520 మి.మీ. కాగా ఆవిరిశాతం అరికట్టడానికి 700 మి.మీ వర్షాపాతం అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ భారీ వ్యత్యాసం వల్ల, వంకలు పారడంలేదు. నదులు పారడంలేదు - వేలాది కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన చెక్‌డ్యాములు, పంటకుంటలు కేవలం అలంకారప్రాయంగా మారి శిధిలమవుతున్నాయి. నిజానికి ఇంతవరకూ నిర్మించిన వాటర్‌షెడ్లు, పంట కుంటల ద్వారా ఏమేరకు భూగర్భజలాలు పెరిగినాయో ప్రభుత్వం ఉహాజనిత లెక్కలు చూపుతూ పత్రికలను, ప్రజలను పక్కదారులు పట్టిస్తూనేవుంది. సాధారణ వర్షాపాతం అధికంగా ఉండే ప్రాంతాల్లో పంటకుంటలు ఉపయోగపడవచ్చు కానీ వర్షాపాతమే లేని అనంతపురం జిల్లాలో ఆకాశంలో మబ్బులు చూపి తాగడానికంటూ ఖాళీముంతలు చేతికిచ్చినట్లుగా వుంటుంది. ఈ కారణంవల్ల ఈ జిల్లాలో గతంలో రెండు - మూడు సంవత్సరాలకు ఒక పంట పండితే, ఇపుడు గడచిన 17 సంవత్సరాలలో రెండు, మూడు పంటలు మాత్రమే పండినాయంటే గ్రామాలపరిస్థితి ఏరకంగా వుంటుందో అర్ధం చేసుకోవచ్చు.

అనంతపురం జిల్లా వైశాల్యంలోనే పెద్ద జిల్లా. ఎంతపెద్దది అంటే గుంటూరు, క్రిష్ణా జిల్లాలు కలిపినంత. విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు కలిపినంత. ఇంతపెద్ద జిల్లాలో వర్షాధార పంటలే గ్రామీణ ప్రజల జీవనాధారం. 25 లక్షల సాగుభూమి కలిగిన జిల్లాలో కనీసం రెండేళ్ళ కొకసారి ఒకపంట పండినా పరిస్థితి ఇంతగా దిగజారిపోదు. గత 8 సంవత్సరాలుగా పంట పెట్టుబడుల రూపంలో రైతాంగం సుమారుగా 20 వేలకోట్లు నష్టపోయింది. అధికారిక లెక్కల ప్రకారమే

| | |
|---|---|
| 2009 ఖరీఫ్‌లో | 2.150 కోట్లు |
| 2010 ఖరీఫ్‌లో | 2.300 కోట్లు |
| 2011 ఖరీఫ్‌లో | 1.900 కోట్లు |
| 2012 ఖరీఫ్‌లో | 2.225 కోట్లు |
| 2013 ఖరీఫ్‌లో | 2.265 కోట్లు |
| 2014 ఖరీఫ్‌లో | 3.100 కోట్లు |
| 2015 ఖరీఫ్‌లో | 3.400 కోట్లు |
| 2016 ఖరీఫ్‌లో | 3.500 నుండి 4 కోట్ల వరకూ. |

పెరుగుతున్న పంటపెట్టుబడులు, పనిముట్లలేమి, సేద్యానికి పశువులు లేకపోవడం కారణాలతో రైతు అప్పుల్లో మునగాల్సివస్తోంది. ఇంత కష్టపడి పంటలు వేసినా పంటలు చేతికి రాకపోవడంతో రైతులు తీవ్రమైన నిరాశా, నిస్పృహలకు లోనవుతున్నారు. జిల్లాలో వ్యవసాయంమీదనే పూర్తిగా ఆధారపడిన చిన్నరైతు కావచ్చు, 50 ఎకరాల పెద్దరైతు కావచ్చు, కదిపితే సమస్యల వెతలే. అందుకే ఏఏటి కాఏడు బతుకుతెరువు కోసం వలసలు పెరుగుతూనే ఉన్నాయి. 50 ఎకరాలు వున్న రైతుకుటుంభాలు సైతం ఉపాధికోసం పరాయి ప్రాంతానికి వలసపోతున్నారు. తనకల్లుమండలంలోని ఈ తోడు గ్రామంలో విశ్వనాథరెడ్డి 15 ఎకరాల ఆసామి. గ్రామసర్పంచుగా ప్రతిసారి ఎన్నికవుతూనే ఉన్నాడు. ఉపాధికోసం బెంగుళూరు వలసపోయినారు. పామిడి మండలంలోని ఎద్దులపల్లి మోతుబరి రైతులున్న గ్రామం. వ్యవసాయంలో పేరెన్నిక గన్నవారు. ఇపుడు ఆ గ్రామంనుండి కూడా ఉపాధికోసం మొదటిసారిగా వలసలు వెళ్ళినారు. దాదాపు నాలుగు లక్షల మందికి పైగా బెంగుళూరు, కేరళ, తమిళనాడుకు వలస వెళ్తున్నారు. వలసవెళ్ళినచోట్ల వారు పడే బాధలు వివరించడం ఇక్కడ సాధ్యం కాదు.

గడచిన 40-50 సంవత్సరాల వ్యవసాయపు అనుభవాలు, ప్రతిసంవత్సరం పడిపోతున్న భూగర్భజలాల పరిస్థితులను గమనించినపుడు పంటలకుంటలు, వాటర్ షెడ్ల లాంటి గోసాయిచిట్కాలు ఫలితాలివ్వలేదని తేలిపోయింది. విజ్ఞత కలిగిన ప్రభుత్వాలు ఏవి అయినా గతం అనుభవాల్ని బేరీజు వేసుకుని వర్తమానం, భవిష్యత్ కార్యక్రమాలు తీసుకోవాలి. ఎవరికెంతలాభం అంటూ లెక్కలు వేసుకునే రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారుల ఆలోచనలతో పురోగతి సాధ్యం కానేకాదు.

ఇదంతా ఆలోచించిన తర్వాత బుర్రున్నవాడికెవడికైనా అర్థం అయ్యేదేమంటే, ఈ జిల్లా బాగుపడాలంటే వ్యవసాయం బాగుపడాలి. వ్యవసాయం బాగుపడాలంటే పడేవర్షాలు మాత్రమే చాలవు. తప్పనిసరిగా బయటినుండి నీళ్ళు తీసుకురావలసిందేనని. 1972 లో సమర్పించిన ఇరిగేషన్ కమీషను నివేదికప్రకారం ఏప్రాంతంలో అయినా వ్యవసాయం మనుగడ సాగించాలంటే కనీసంగా 30 శాతం సాగుభూమికి నీటి పారుదల సౌకర్యం కలిగించాలని చెప్పింది. 2004 లో జయతీఘోష్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన రైతుసంక్షేమ కమీషన్ గాని, 2010లో ఐ.సి.ఎ.ఆర్. జాతీయస్థాయిలో పర్యటించిన నిపుణుల కమిటీగానీ, జిల్లాలో పర్యటించిన యం.యస్.స్వామినాథన్ ఫౌండేషన్ సిపారసులు గానీ, ఈ జిల్లాలో వ్యవసాయం బాగుపడాలంటే అనేక చర్యలతో పాటు బయటినుండి నీటి పారుదల సౌకర్యం కల్పించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఆయా ప్రభుత్వాలు నియమించిన కమీషన్ల సిఫారసులనే ప్రభుత్వాలు పెడచెవిన పెట్టినాయి. మరి జిల్లాలో సాగునీటి వనరులు ఏమేరకు ఉన్నాయో వాటిని కూడా పరిశీలిద్దాం.

## అనంతపురం జిల్లాకు నదీ జలాల సౌకర్యం

అనంతపురం జిల్లాకు 25 లక్షల సాగుభూమికల జిల్లాకు, అత్యల్ప వర్షాపాతంతో నిత్యం కరువుల్ని ఎదుర్కొంటున్న జిల్లాకు బచావత్ ద్వారా నీటికెటాయింపులు ఈవిధంగా ఉన్నాయి.

తుంగభద్ర ఎగువకాలువ స్టేజి 1, స్టేజి 2 ద్వారా 21.4 టిఎంసిలు కెటాయించబడినాయి. 1,4,5,236 ఎకరాలకు నీరివ్వాలని సంకల్పం. కాని తుంగబధ్ర డ్యాం పూడికవల్ల కెటాయింపులు తగ్గిపోయి కేవలం 16 నుంచి 18 టిఎంసిలు మాత్రమే ఇస్తున్నారు. గత సంవత్సరం 10.7 టిఎంసిలు మాత్రమే ఇచ్చినారు. జిల్లాలో 1,45,000 ఎకరాలకుగాను కేవలం 77 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు (ఒక పంటకు మాత్రమే) నీరిచ్చారు. బహుశా అధికారిక కెటాయింపులు కలిగి ప్రతి సంవత్సరం తక్కువ నీరు వస్తున్నది ఏదైనా పథకం ఉందంటే ఇది దేశంలోనే మొదటిది కావచ్చు.

అదేవిధంగా హగరి నది మీద నిర్మించిన భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కూడా బచావత్ ద్వారా 4.90 టిఎంసిల కెటాయింపులు ఉన్నాయి. దాదాపు 20 సంవత్సారాల నుంచి ప్రాజెక్టులోకి నీరు వస్తే ఒట్టు. ప్రాజెక్టు, దాని ప్రధాన కాలువలు, పిల్ల కాలువలు వట్టిపోయి చారిత్రక చిహ్నాలుగా మిగిలిపోయినాయి.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అనంతపురం జిల్లాలో ఎక్కువ భాగం పెన్నానది పరీవాహక ప్రాంతానికి చెందినదయినా, నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్న అనంతపురం జిల్లా, బళ్ళారి, రాయచూరు జిల్లాలకు కర్నూలు జిల్లాలోని ఆలూరు, పత్తికొండ ప్రాంతాలకు సాగునీరు అందించాలని బ్రిటీషు పాలకులు తుంగభద్ర నది మీద ఒకభారీ నీటిపారుదల ప్రాజెక్టును రూపొందించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారిపోవడంతో సైజునుకుదించి అనంతపురం జిల్లాకు నామమాత్రంగా నీళ్ళు అందించారు. అయితే ఎగువకాలువ ద్వారా వచ్చిననీరు పూర్తిగా వ్యవసాయానికే కెటాయింపులు ఉన్నప్పుటికీ తాగునీటి సమస్య వచ్చిపడడంతో తాగునీటికి ప్రాముఖ్యతనిచ్చి, వ్యవసాయానికి నీటి సరఫరా నామమాత్రం చేశారు. ఎగువ కాలువకు సమాంతర కాలువ ద్వారా పోగొట్టుకుంటున్న నీటిని తెస్తామని, కాంగ్రేసుపార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతిపక్ష స్థాయిలో కాలువల మీద పాదయాత్రలు చేస్తునే ఉన్నారు. ఆధికారంలోకి వస్తూనే చాలా సౌకర్యంగా మర్చిపోతున్నారు. దాదాపు 16-17 సంవత్సరాల నుంచి ఈ ప్రహసనం నడుస్తూనే వుంది. రైతులు మోసపోతూనే ఉన్నారు.

## శిలాఫలకాల పథకం హంద్రీ - నీవా

ఈ జిల్లాలో సూపరింటెంటెంట్ ఇంజనీరుగా పనిచేసిన శివరామక్రిష్ణయ్యగారు ఈ జిల్లా నీటికరువును పోగొట్టడానికి హంద్రీ - నీవా పథకాన్ని రూపొందించారు. ఈ జిల్లా ప్రజలను అదుకోవాలనే తపన ఉన్న అప్పటిముఖ్యమంత్రి రామారావుగారు ఈ పథకాన్ని ఆమోదించారు. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం ద్వారా 40 టిఎంసిలు శ్రీశైలం బ్యాక్‌వాటర్స్ మల్యాల నుంచి తీసుకొని 6,025 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలని నిశ్చయించారు. జి.ఓ.యం.యస్ నెం.66 తేది 10.06.1996 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారు. 11.03.1996న ఉరవకొండలో శంకుస్థాపన కూడా చేశారు. అనంతపురం జిల్లాతోపాటు, రాయలసీమలోని మిగతా మూడు జిల్లాలకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేశారు. ఒక్క అనంతపురం జిల్లాకే దాదాపు 20 టిఎంసిలతో 3,45,000 ఎకరాలకు సాగునీరందించాలని వారి ఉద్దేశ్యం.

రామారావుగారి తర్వాత చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి అయినారు. పథకం రూపురేఖలు మార్చి కేవలం 5.50 టిఎంసిలు మాత్రమే తాగునీటి కోసం కెటాయించాలని (అనంతపురం, కర్నూలు జిల్లాలకు మాత్రమే) జి.ఓ.ఎం ఎస్ నెం. 68 తేది 06.05.1998 ద్వారా ఉత్తర్వులిచ్చి అనంతపురం జిల్లాలోని ఆత్మకూరులో 09.07.1999న భూమిపూజ చేసి పైలాన్ అవిష్కరించారు. పనులు మాత్రం సాగలేదు. అనంతపురం కర్నూలుజిల్లా ప్రజల ఆందోళనతో 10 టిఎంసిల మళ్ళింపులు జరిపేటట్లు తాగునీటితోపాటు 80 వేల ఎకరాలకు సాగునీరందించాలని చంద్రబాబునాయుడుగారు 2002లో తిరిగి ఉత్తర్వులు సవరించారు. అక్కడక్కడా కాలువలు తవ్వుతామన్నట్లుగా గుంతలు పెట్టి వదిలారు. వాస్తవానికి శ్రీశైలం వెనుక వైపు నుంచి వరదల కాలంలో 60 టిఎంసిలు ఎత్తిపోతలద్వారా మళ్ళించవచ్చునని శివరామకృష్ణయ్యగారి నివేదిక చెపుతోంది.

చివరికి రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తర్వాత హంద్రీ - నీవా పథకాన్ని తిరిగి పూర్వస్థాయికి మంజూరుచేస్తూ 40 టిఎంసిలతో ప్రారంభించి 2013 కల్లా స్టేజ్ 1, స్టేజ్ 2 పూర్తిచెస్తామని ప్రకటించినారు. కాంగ్రేసుపార్టీ హయాములోనే జిల్లా నాయకుల పట్టుదల వల్ల జీడిపల్లి జలాశయం వరకూ నీళ్ళు తీసుకొచ్చారు. హంద్రీ-నీవా పథకానికి గొంతుపిసికి మూలనపడేసిన దక్షత చూపించుకున్న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే అరకొర నిధులతో పునారిల్లుజేసి పనులునత్తనడకన నడిపిస్తున్నారు. అనంతపురం జిల్లాలోని జీడిపల్లి జలాశయం వరకూ స్టేజి 1, ఆ తరువాత స్టేజి 2గా విభజించారు. ఈ స్టేజి 1లోనే ఇంతవరకూ పిల్లకాలువలు కానీ, తూములు గానీ ప్రారంభించలేదు. కుప్పానికి ప్రధాన కాలువను పొడిగిస్తామంటూ ఉన్నారు. కుప్పంకాలువతో పాటు, కె.సి.కెనాల్‌కు ఇందునుంచే నీరిస్తామంటున్నారు. కర్నూలు జిల్లాలోని ఆలూరుకు ప్రాంతానికి వెళ్ళే గుంతకల్లు బ్రాంచికాలువకు ఇందునుంచే నీరిస్తామంటున్నారు. జిల్లాలోని పేరూరు ప్రాజెక్టుకు కూడా ఇందునుంచే నీరిస్తామంటున్నారు. వీటన్నింటికి నీరివ్వాలంటే పథకపు సామర్థ్యం 40 టిఎంసిల నుంచి 60 టిఎంసిలకు పెంచాలి. ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో బ్రాంచికాలువలు, పిల్లకాలువలు పూర్తిచేసి అయకట్టుకు నీళ్ళిచ్చారు. అనంతపురం జిల్లాలో మాత్రం ఒక్క ఎకరాకు నీళ్ళివ్వలేదు. ఏప్రిల్ 20న పామిడి బహిరంగసభలో ఈ జిల్లాకు హంద్రీ - నీవా ద్వారా 28 టిఎంసిల నీటిని తెచ్చినామని ముఖ్యమంత్రి గారు స్వయంగా ప్రకటించారు. అధికారులు విడుదలచేసి నివేదికల ప్రకారం చెరువులకు ఇచ్చిన నీటి మొత్తం 1.50 టిఎంసిలు దాటలేదు. మిగతా నీరు ఎక్కడ పెట్టినట్లు? తాగునీటికోసం ఏమైనా మళ్ళించివుంటే 5-6 టిఎంసిలు మించివుండదు. మరి నీటిని ఏ బ్యాంకులలో దాచినట్లు? 28 టిఎంసిలకు లెక్కలు చెప్పమంటే అధికారులు దాటవేస్తున్నారు. ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వకుండా అన్ని నీళ్ళు ఏంచేసినట్లు? జిల్లా ప్రజలకు ఈ ప్రశ్న ఒక బ్రహ్మ పదార్థంగా మిగిలిపోయింది.

## జిల్లా బాగుకు పరిష్కారాలే లేవా ?

ప్రతి సమస్యకూ పరిష్కారం వుంటుంది. సాంకేతికవిజ్ఞానం అభివృద్ధిచెందిన ఈదశలో సాధ్యంకానిదే లేదు. కాకపోతే పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడమే అసలు

సమస్య. నీటికొరతను అధిగమించడానికి 5-6 శతాబ్దాలనుంచే ఈ జిల్లాలో వేలాదిగా చెరువులు కుంటలు తవ్వారు. నీటి కొరతకు పరిష్కారాన్ని వెతుకున్నారు. సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందని దశలోనే పరిష్కారాలు లభ్యమయినప్పుడు ఇపుడెందుకు సాధ్యంకాదు? ప్రస్థుతం తేలిన లెక్కలప్రకారం 1373 చెరువులు, 2000 వరకూ కుంటలు జిల్లాలో ఉన్నాయి. చెరువులు, కుంటలు కలిపి నదీ పరీవాహక ప్రాంతాల్లో గొలుసుకట్టుగా వుండడంవల్ల 10-12 పాయింట్ల వద్దకు నీరు కాలువల ద్వారా చేర్చగలిగితే ఒకదాని తర్వాత మరొకటి నిండిపోతాయి. తెలంగాణా రాష్ట్రంలో మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్ని, కుంటల్ని పునరుద్దరిస్తున్నారు. ఇక్కడెందుకు సాధ్యం కాదు? 20 టిఎంసిల నీటితో వీటన్నింటిని నింపవచ్చు. దీనిద్వారా నీటివనరులు కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ చెందుతాయి. మనుషులకే కాకుండా పశువులకు, జంతువులకు పక్షులకు తాగునీరు దొరుకుంది. గతంలో పొలాల్లో బావులద్వారా, బోర్లద్వారా తోడే నీటితో పక్షులు, జంతువులు దాహార్తిని తీర్చుకునేవి. ఇపుడు ఎన్ని కిలోమీటర్లు నడిచినా ఒక చుక్క నీరు దొరకదు. ఎక్కడైనా బోర్లద్వారా వచ్చే నీరు కంటికి కనపడకుండా పైపులద్వారా వచ్చి, పైపులద్వారానే డ్రిప్పులతో చెట్ల మొదళ్ళలోకి నీరు వెళ్ళిపోతుంది. అందుకే అడవుల్లో ఇంకా మిగిలివున్న అడివి జంతువులు నెమళ్ళు నీటిజాడలకోసం రాత్రిపూట గ్రామాల్లోకి వస్తున్నాయి. చుక్కనీరు దొరకక పక్షులు తీవ్రమైన ఎండలకు ఎండుటాకుల్లా రాలిపోతున్నాయి. ప్రకృతిలో మిగతా ప్రాణులు లేకుండా మనిషి మాత్రమే సుఖంగా జీవించగలడా?

(1) ఇందుకు ఈ వ్యాసం ద్వారా చూపే పరిష్కారమేమిటంటే డా.శివరామక్రిష్ణయ్య సేవాసమితి తరుపున ప్రభుత్వానికి 2007లో ఒక విజ్ఞాపన సమర్పించడం జరిగింది. దాని ప్రకారం తుంగభధ్ర డ్యాం పూడిక వల్ల కోల్పోతున్న నీటిని భర్తీచేస్తూ అదనంగా అనంతపురం జిల్లాకు తాగునీటి అవసరాలకోసం తుంగభద్ర నది డ్యాము దాటిన తర్వాత రాష్ట్రపరిధిలో కర్నూలు జిల్లా నుంచి 50 టిఎంసిల నీరు ఎత్తిపోతల ద్వారా మళ్ళించాలని విజ్ఞప్తిచేసింది. దీనిమీదట జలవనరుల శాఖ ఇంజనీర్లు కర్నూలు జిల్లా సి.బెలగల్ మండలం, రంగాపురం వద్ద నుంచి 40-50 టిఎంసిల నీరు ఎత్తిపోతల ద్వారా ఉన్నటువంటి హెచ్.ఎల్.సి ఎగువ కాలువకు కలుపవచ్చని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దాని మీదట రాష్ట్రప్రభుత్వం (అప్పటి రాజశేఖర రెడ్డి ప్రభుత్వం) కన్సల్టెన్సీని నియమించుకుని ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా ఒక కోటి 11 లక్షల నిధులు కూడా కెటాయించారు. ఆ తరువాత ప్రభుత్వం - జలవనరుల శాఖ - రాజకీయ నాయకుల మధ్య బంతిలాగా ఈపథకం నలిగిపోతూనే ఉన్నది.

ఈ పథకమే గనుక చేపడితే, చెరువులు, కుంటలన్నింటికి నీళ్ళివ్వవచ్చు. జిల్లాలో తాగునీటి కోసం కెటాయించవచ్చు. హెచ్.ఎల్.సి. ఆయట్టుదారులు, భైరవానితిప్ప ప్రాజెక్టు ఆయకట్టు దారులకు పూర్తిగా నీరివ్వవచ్చును. ఈ విషయం మీద గతసంవత్సరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి విజ్ఞాపన కూడా ఇవ్వడం జరిగింది ఫలితం శూన్యం.

(2) జిల్లాలోని చెరువులు, కుంటల పూర్వం ఉన్న అనుసంధాలన్నింటిని అభివృద్ధిపర్చి వాటిని నీటితోనింపడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. తద్వారా ఎండిపోతున్న బోర్లు రీచార్జి జరిగి బోర్ల వ్యవసాయం పెరుగుతుంది. అంతేకాకుండా ఇవి గ్రామాల తాగునీటి రిజర్వాయర్లుగా ఉపయోగపడుతాయి. 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుచేసి జిల్లాలోని గ్రామాలన్నింటికి తాగునీరు సరఫరా చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఇంతవరకూ ఆపథకం అతీగతీ లేకపోయినా ముఖ్యమంత్రిగారి వాగ్దానం నెరవేరడానికి వాటర్‌గ్రిడ్ కోసం ఈ చెరువులు కుంటలు ఉపయోగపడుతాయి.

(3) జిల్లాలో రైతులు 22 రకాల పళ్ళ తోటలను పెంచుతున్నారు. ఒక్కొక్కసారి గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అందుకు, టొమేటో, బొప్పాయి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి.

(4) జిల్లాలో సంవత్సరంలో 340 రోజులు ఎండలే కాస్తాయి. ప్రభుత్వం బహుళజాతి, పెట్టుబడిదారి సంస్థలకు సోలార్ వనరులు ధారపోసి కంపెనీలకు లాభాలు చేకూర్చే బదులు, ప్రతి పంచాయితి గ్రామాలకు కలిపి ఒక కె.వి. సామర్థ్యంతో గుట్టలు బీడు భూముల్లో సోలార్ యూనిట్లను ప్రభుత్వం నెలకొల్పాలి. ఆ గ్రామాల్లోని రైతులకు ఉమ్మడి యాజమాన్య హక్కులు కల్పించి ప్రభుత్వం నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తూ కరెంటును అమ్మిపెట్టాలి.

(5) అనంతపురం జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు లేక పరాయిప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వలస వెళ్తున్నారు. దేవనహళ్ళి బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం జిల్లాకు సమీపంలోనే జాతీయ రహదారిపై వుండడం అనుకూలమైన అంశం, పదవ తరగతి, ఇంటర్ చదువుకున్న పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించదానికి, జిల్లాలో కంప్యూటర్ హార్డ్‌వేర్ పరిశ్రమలు నెలకొల్పాలి. యువతకు తగుశిక్షణ ఇవ్వడంద్వారా శాశ్వత ఉపాధి దొరుకుతుంది.

(6) హిందూపురం, కదిరి ప్రాంతాల్లో గార్మెంట్ పరిశ్రమలు నెలకొల్పడానికి పరిశ్రమదారులకు ప్రోత్సాహమివ్వాలి. ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే, మానవ అక్రమ రవాణా, తదితర సమస్యలు తగ్గుముఖం పడతాయి.

ఇవన్నీ పెద్దవిషయాలేంకావు. ప్రభుత్వాలు దృష్టిపెడితే సాధ్యం కానిదేం లేదు. ఆవైపు ప్రభుత్వాల దృష్టి మళ్ళే విధంగా పౌరసమాజాలు ఒత్తిడి తేవాల్సివుంటుంది.

**25.4.2017**
**అనంతపురం**

# అనంతపురం జిల్లా - కరువులు - జీవన సంక్షోభం - పరిష్కారాలు

- బి. సూర్యసాగర్

అనంతపురం జిల్లా కరువుకు పర్యాయపదంగా మారిపోయింది. మనకు తెలిసిన మేరకు విజయనగర సామ్రాజ్యం కాలం నుండీ, అంటే ఐదు శతాబ్దాల క్రితం నుండి అనంతపురం కరువుల చరిత్ర నమోదయివుంది. బ్రిటీష్ వలస పాలన, తదనంతర స్వతంత్ర పాలన కాలంలో కరువుల తీవ్రత, తరచుదనము పెరుగుతూ వచ్చాయి. రెండేళ్ళ, మూడేళ్ళ కరువు వ్యవధి పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం (2017 నాటికి) గత ఎనిమిది సంవత్సరాల వరుస కరువు సంభవించడం మాత్రం జిల్లా చరిత్రలో బహుశ ఇదే ప్రథమం కావచ్చు. అంటే వర్షాభావ స్థితి క్రమంగా తీవ్రమవుతున్నది. నైసర్గికంగా అసలే వర్షచ్ఛాయ ప్రాంతంలో వున్న అనంతపురం జిల్లాకు ఈ పరిణామం పెను ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెద్ద సంక్షోభంలో చిక్కుకొని వుంది. రైతులు, వ్యవసాయధారిత ఇతర గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. కనీస జీవనావసరాలు కూడా తీరని పరిస్థితి ఏర్పడింది. పట్టణాలలో వ్యాపార వర్గాలు కూడా వ్యాపారాలు జరగక సంక్షోభంలో వున్నారు.

జిల్లాలో మచ్చుకు కూడా పరిశ్రమ అన తగ్గది లేదు. యువతలో నిరుద్యోగం తాండవిస్తున్నది. విజృంభించిన ప్రయివేటు విద్యా, వైద్య వ్యాపార రంగాలు రైతాంగాన్ని, గ్రామీణ, పట్టణ పేదలను మరింత రుణాల పాలు గావిస్తున్నాయి. సామాన్య ప్రజల్లో కూడా విద్యాభివృద్ధి పట్ల అభిలాష పెరిగిన పరిస్థితి ఆసరాగా విద్యా, వ్యాపార రంగం వారిని తీవ్రమైన దోపిడీకి గురిచేస్తున్నది. కుటుంబాలను అప్పులపాలు చేసి నిరుద్యోగ యువతను మిగులుస్తున్నది. కుటుంబానికి యువత భారమై కూర్చున్నది. మరోవైపు పోషకాహార లోపం వల్లనైతేనేమి, పర్యావరణ కాలుష్యం వల్లనైతేనేమి, అన్నపానీయాల అనైతిక కల్తీ వల్లనైతేనేమి, సామ్రాజ్యవాద సంస్కృతి తెచ్చిన వినాశకర జీవన శైలి వల్లనైతేనేమి ప్రజల ఆరోగ్యం పెను ప్రమాదంలో పడింది. ప్రభుత్వాలు ప్రజారోగ్య రంగం నుండి వైదొలుగుతున్నాయి. ప్రయివేటు వైద్య రంగం ప్రజల అనారోగ్యాలతో వ్యాపారం చేస్తూ విపరీతమైన దోపిడీకి పాల్పడుతున్నది. ప్రజల ఆరోగ్యం నానాటికి క్షీణిస్తున్నది. అనారోగ్యాలు, వైద్యం ఖర్చుల వల్ల ప్రజలు అప్పుల్లో కూరుకుపోతున్న పరిస్థితి వుంది. జిల్లాలో ఏ గ్రామానికెళ్ళినా ఈ పరిస్థితులు చూడవచ్చు.

అనంతపురం జిల్లా వార్షిక సగటు వర్షపాతం 520 మి.మీ. అని లెక్కిస్తున్నారు. వర్షపాతం 750 మి.మీ. వున్న వర్షాధార పంటలు కనాకష్టంగా పండుతాయి. జిల్లాలో సాధారణ పరిస్థితులలోనే సగటున 300-350 మి.మీ. వర్షపాతం నమోదయ్యే మండలాలున్నాయి. ఉదా: కూడేరు, ఆత్మకూరు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో కెల్లా అత్యల్ప వర్షపాతం గల మండలాలు ఇవి. కదిరి ప్రాంతం కూడా తీవ్ర దుర్భిక్షాన్నెదుర్కొంటున్న ప్రాంతం. జిల్లాలో వ్యవసాయం శాశ్వత నష్టదాయకంగా వుంది. తుంగభద్ర హెచ్.ఎల్.సి. నీళ్ళు పారే కొద్దిపాటి ప్రాంతం కూడా ఈ సంవత్సరం బీడుపడిపోయింది. అయినా రైతులు వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. వారికి వేరే బతుకు తెరువు ఏదీ లేదన్నదే అసలు విషాదం. తీర్చలేని అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో రోజుకు ఇద్దరు, ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడుతున్న స్థితి కొన్ని నెలల పాటు సాగిన సందర్భాలు కూడా వున్నాయి.

భారతదేశంలో సగటున రోజూ 2000 మంది రైతులు వ్యవసాయం నుండి వైదొలుగుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వర్షాభావం వల్ల, వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీయని ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. అనంతపురం జిల్లాలో ఈ క్రమం ప్రత్యేక తీవ్రతను సంతరించుకుంది. ఆ రైతులు, గ్రామీణులు ఏమైపోతున్నారు? ఎక్కడికి పోతున్నారు? రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు; రైతుకూలీలుగా మారిపోతున్నారు; ఇల్లు, ఊరు వదిలేసి మూటా ముల్లె నెత్తినేసుకొని పొట్ట కూటి కోసం నగరాలకు దీనంగా వలస బాట పడుతున్నారు. అనంతపురం జిల్లా నుంచి ఇప్పటికి 4 లక్షల మంది పైగా వలసపోయారని పత్రికలు రాస్తున్నాయి.

నగరాల్లో ఈ వలస జీవులు నిర్మాణ కూలీలుగా, రిక్షా కార్మికులుగా, ఆటో వర్కర్లుగా, డ్రైవర్లుగా, ఇంటి పని మనుషులుగా, ఆయాలుగా, మున్సిపల్ వర్కర్లుగా, దుకాణాల్లో - ఆఫీసుల్లో వర్కర్లుగా, ఇళ్ళ- ఆఫీసుల-భవనాల కాపలాదార్లుగా, గార్మెంట్స్ - ఫ్యాక్టరీల్లో కార్మికులుగా, బార్‌లలో -హోటళ్ళలో పనివాళ్ళుగా, పూలు-పళ్ళు-కూరగాయల చిరు వ్యాపారాలలో - ఇలా సవాలక్ష రకాల పనుల్లో, ఎవరు లేకపోతే నగర జీవితం ఊపిరాడక స్తంభించిపోతుందో, ఆ పనులన్నింటా గ్రామీణ వలస జనాభా విస్తరించి వున్నారు. వాళ్ళలో ఎవరిని కదిలించి సంభాషించినా వారి గ్రామీణ మూలాలు, గ్రామీణ విధ్వంసము వెళ్ళడవుతాయి. నిలవ నీడలేని పేదల వలస జీవితం ఎంత దుర్భరమైనదో వారి నుండి తెలుసుకున్నప్పుడు గాని మన ఊహకందదు.

గ్రామీణ సమాజం ఎంత వెనుకబాటుతనంలో, పేదరికంలో వున్నప్పటికీ అక్కడ ప్రజలకు ఒక రక్షక వాతావరణం వుంటుంది. దాని అండతో వారు మిణుకుమిణుకుగా అయినా జీవితేచ్ఛను, జీవితాశను వెలిగించుకొని బతుకు పోరాటం చేస్తుంటారు. బంధు వర్గము, ఇరుగు పొరుగు శ్రేయోభిలాషులు, గ్రామ నియమాలు, రేషన్ ధాన్యము, స్వంత ఇల్లు (పూరిల్లయినా), పెళ్ళి-పండగల చిరు సంతోషాలు, స్త్రీలకు-బాలలకు ఏదోమేరకు భద్రత, ఇత్యాది బంధాలు-అనుబంధాలు వాళ్ళకు ధైర్యాన్నిస్తుంటాయి. ఇవేవీ లేని నగర వలస జీవనంలో ఏకాకులుగా, అనాథలుగా, నిస్సహాయులుగా, నిరంతరం అభద్రతా

ప్రమాదంలో బతుకు వెళ్ళదీయడంలోని క్షోభ, హింస భరించలేనిది. నిరంతర కరువు పీడిత కదిరి వంటి ప్రాంతాల నుండి మహిళల అక్రమ రవాణా జరుగుతున్నది. నిర్మాలారాణి మొదలగు కథా రచయితలు ఈ భయంకర వాస్తవాన్ని కథా సాహిత్యంలో నమోదు చేసారు.

గ్రామాల్లో ప్రజలు అలవాటుపడిన బీద జీవితాన్ని కూడా కరువు దక్కకుండా చేస్తుంది. వర్షాభావంలేని సంవత్సరాల్లో కూడా అంతంతగానే వున్న గ్రామీణ బతుకులు వరుస కరువుల్లో ఎలా వుంటాయో ఊహకందదు. సామ్రాజ్యవాద పెట్టుబడుల మార్కెట్ల చొరబాటుతో అర్థ భూస్వామ్యంగా మారిన పీడక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రైతాంగాన్ని, గ్రామీణ పేదలను సుదీర్ఘ దోపిడీకి, పీడనకు, వేదనకు గురిచేస్తున్నది. ఈ వ్యవస్థకు గ్రామీణులు బందీలుగా వున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాకుండా, జాతీయ పరిశ్రమలు ఏర్పడకుండా, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు మృగ్యమైపోయిన పరిస్థితుల్లో నిరంతర కరువుల అమానుష జీవిత ఫలనాలు పరమ దారుణంగా పరిణమిస్తాయి. ప్రాకృతిక ప్రతికూలతలు ఒకవైపు, కరువు పీడిత ప్రాంతాల పట్ల ప్రభుత్వాల నేరస్థ నిర్లక్ష్యం మరొక వైపు రైతాంగ, గ్రామీణ పేదల జీవితాలను అల్లకల్లోలం చేశాయి.

పెట్టుబడిదారి విధానము, ముఖ్యంగా దాని సామ్రాజ్యవాద దశలో దురాశాపూరిత అతి లాభాల వేటలో ఒక శతాబ్దం పైగా సాగిస్తూ వచ్చిన ప్రకృతి వనరుల దుర్వినియోగము, దోపిడి మరియు మారణ యుద్ధాలు, యుద్ధ ప్రయత్నాలు పర్యావరణ విధ్వంసానికి దారితీశాయి. దాని పర్యవసానమే భూగోళ వాతావరణంలో వచ్చిన హానికర మార్పులు. రుతుపవన వర్షాలపై ఆధారపడిన భారతదేశంలో వర్షాల రుతుక్రమము, వర్షాపాత స్థాయి తీవ్ర ఒడిదుడుకులకు లోనైనాయి. అందులో భాగంగా సహజంగానే వర్షచ్ఛాయా ప్రాంతంలో వున్న అనంతపురం జిల్లాలో వర్షపాతం మరింత కుదించుకుపోయి రుతువుల క్రమం అస్తవ్యస్తమైంది. 2016 ఈశాన్య రుతుపవనాలు పూర్తిగా మొహం చాటేశాయి. నైరుతి రుతుపవనాలు అరకొరగా వీచాయి. దీని ఫలితమే జిల్లాల వ్యవసాయము, గ్రామీణ ఆర్థికంలో అంతులేని సంక్షోభం ఏర్పడింది. ఇది వరుసగా ఎనిమిదవ సంవత్సరం కరువు. భూగర్భ జలాలు అడుగంటి వందల గ్రామాల్లో తాగునీరు కూడా లభ్యంకాని పరిస్థితి వచ్చింది. జిల్లాలోని మొత్తం 63 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి ఆరు మాసాలయినా కరువు సహాయక చర్యలు మాత్రం శూన్యం.

రాష్ట్రంలో అతి పెద్ద జిల్లాగా వుండి, 25 లక్షల ఎకరాల సాగుయోగ్యమైన భూమిని కలిగివుండి, 34 లక్షల జనభాకు ఆవాసంగా ఉన్న అనంతపురం జిల్లాలో కరువు నివారణ పట్ల పాలకవర్గ పార్టీల్లో చిత్తశుద్ధిగాని, రాజకీయ సంకల్పం గాని లేవు. అవి దివాలాకోరు, దగాకోరు పార్టీలు. తీవ్ర, నిరంతర వర్షాభావంతో పీడింపబడుతున్న అనంతపురం జిల్లాకు నదీ జలవనరులను మళ్ళించడంలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సి వుండగా, అత్యల్ప సాగునీటి వనరులు గల జిల్లాగా మిగిల్చడంలో ప్రభుత్వాల, పాలక వర్గాల దుర్మార్గం దారుణమైనది. ఆయా ప్రాంతాలకు అవసరమైన రీతిలో నదీ జలాలను పంపిణీ చేయడం న్యాయమైన, ప్రజాస్వామికమైన విధానంగా వుండగలదు. అది ప్రభుత్వాల బాధ్యత. ప్రజల హక్కు.

అయితే దళారి పాలక వర్గాలకు, ప్రభుత్వాలకు దేశాన్ని, రాష్ట్రాలను, భిన్న ప్రాంతాలను సమభావనతో, సమగ్రంగా, సామరస్యంగా, ప్రజాస్వామికంగా అభివృద్ధి పరచడంలో ఆసక్తిలేదు. అక్రమ, అవినీతి మార్గాల్లో సంపద పోగేసుకోవడం, అధికారాన్ని చేజిక్కించుకోవడమే వారి క్షుద్ర లక్ష్యం. ప్రభుత్వాలు సామ్రాజ్యవాద కంపెనీలకు, దేశాలకు, స్వదేశీ దళారీ, లంపెన్ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే పనిలో తలమునకలయి వున్నాయి. పాతికేళ్ళ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఈ దుర్మార్గాన్ని, దోపిడీని తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో నిత్య కరువు పీడిత ప్రాంతాలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. కొన్ని ప్రాంతాలను శాశ్వత కరువు పీడిత ప్రాంతాలుగా కొనసాగించడంలో ఆంతర్యమేమి? సామ్రాజ్యవాద, దళారీ పారిశ్రామిక, వ్యాపారశక్తుల దోపిడీ ప్రయోజనాల నిమిత్తం, చౌక కూలీలను అందించే వ్యూహంలో భాగంగా అనంతపురం జిల్లా, ఇతర కరువు పీడిత ప్రాంతాలు దుర్భిక్షం బారిన విసరివేయబడినాయి. ఈ దుర్మార్గాన్ని ఎండగట్టి ప్రజలను చైతన్యపరచవలసిన అవసరముంది.

అనంతపురం జిల్లా పాలకవర్గ రాజకీయ నాయకులకు ప్రాంతీయ సర్వతోముఖాభివృద్ధి పట్ల ఆసక్తి లేదు. ప్రాంతీయాభిమానముగాని, ప్రజాభిమానముగాని, ప్రజాస్వామిక దృక్పథం గాని మచ్చుకు కూడా లేవు. అక్రమ మార్గాల్లో సంపాదన మరిగి, మోసపూరిత మార్గాల్లో ఎన్నికల్లో నెగ్గి తమ సంపద, అధికారాలను పెంచుకోవడం మరిగినారు. తమ పార్టీల హైకమాండ్ ముందు చేతులు కట్టుకొని నిలుచునే బానిసత్వమే వాళ్ళు నేర్చిన కళ. తరతరాలుగా కరువు పీడితులై అభద్రతా జీవనానికి అలవాటుపడిన ప్రజలను వరుస కరువుల నుండి విముక్తికై, సాగునీటి, తాగునీటి వనరుల సాధనకై కదిలించి ఉద్యమ బాట పట్టించాలంటే పాలకవర్గ శక్తుల ప్రభావం నుండి వారిని తప్పించి, వారి నిజ జీవితావసరాల కోసం ఉద్యమింపచేయడమే మనముందున్న కర్తవ్యం. ప్రజా ప్రయోజనాలకై ఉద్యమిస్తున్నామని నమ్మబలుకుతున్న కొన్ని శక్తులే పాలకవర్గ భావాలు, ప్రయోజనాల నుండి తెగతెంపులు చేసుకోవడంలో విఫలమవుతున్న దురదృష్టకర దృశ్యం కూడా మనముందున్నది. నిజాయితీతో కూడిన ఉద్యమ నిర్మాణ ఆవశ్యకత మాత్రం వుంది. కరువు సమస్యపై తక్షణ, శాశ్వత పరిష్కారాల ప్రాతిపదికన రైతాంగాన్ని పోరాటానికి ఆర్గనైజ్ చేయడమే ఉద్యమకారుల కర్తవ్యం.

గతంలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కరువు సమస్యపై అనేక పోరాటాలు నిర్వహించింది. గంజి కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, కరువు పనులు సాధించుకోవాలన్నా పోరాటాలు చేయవలసి వచ్చింది. 1966-67లో అనంతపురం జిల్లాలో ఘోర కరువు సంభవించినప్పుడు ఇందిరాగాంధి ప్రభుత్వంలో డిప్యూటి ప్రధానమంత్రిగా వుండిన మొరార్జిదేశాయి అనంతపురం రావడం తటస్థించింది. కా॥ తరిమెల నాగిరెడ్డి కరువు సహాయక చర్యలకై ప్రజలను పెద్ద ఎత్తున కదిలించి స్వయంగా నాయకత్వం వహించాడు. మొరార్జి సభను దిగ్బంధం చేసి కరువు సహాయక హామీలను రాబట్టాలని కా॥ టి.ఎన్. ప్రజలను చైతన్య పరిచాడు. పోలీసులు కా॥ టి.ఎన్.తో సహా నిరసనకారులందరినీ నిర్బంధించి లారీలలోకి తోసి పట్టణానికి పదిమైళ్ళ దూరంలో దించేసి వచ్చారు. అయినా మొరార్జి సభ ముగిసేలోపే కా॥ టి.ఎన్. నిరసనకారులతో సహా తిరిగి సభాస్థలికి చేరుకొని ఆందోళన చేశారు.

కరువు దేశంలో చాలా చోట్ల వుందని మొరార్జి చులకనగా మాటలాడటంతో, ఇక్కడ యేటా కరువుంటుందని తెలుసా అని నిలదీశాడు కా॥ టి.ఎన్. మొరార్జి తాగునీటి సమస్య పరిష్కారానికై రు.25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు.

కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా ఘోర కరువు సంభవించింది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎంతకీ దిగిరాకపోవడంతో కా॥ టి.ఎన్. నిరాహారదీక్ష పూనాడు. ప్రజలు పెద్ద ఎత్తున కదిలి వచ్చారు. నిరాహారదీక్ష సరైన పోరాట మార్గం కాదన్న విమర్శలు వచ్చాయి. ప్రజలను కదిలించడానికి ఏ పోరాట రూపాన్నయినా చేపట్టడంలో తప్పులేదని ఆయన ప్రకటించాడు.

1953లో జి. రామకృష్ణ (అనంతపురం) రచించిన "గంజికోసరం" కథ 1948-52లో సంభవించిన ధాత కరువు నేపథ్యంలో వచ్చిన వాస్తవిక కథ. ఆమడ దూరం నడచి వెళ్ళినా గంజి కూడా దొరకని క్షామాన్ని ఆ కథ నమోదు చేసింది. అనంతపురం జిల్లాలో వ్యవసాయం జూదంగా మారిన వైనాన్ని సింగమనేని నారాయణ "జూదం" కథలో (1978) వెల్లడించాడు. ఆయనే "ఊబి" కథలో భార్య మెడలో బంగారు గొలుసు తాకట్టుపెట్టి తెచ్చిన మూడువేల రూపాయలతో ఏడు మట్టుల (ఒక మట్టు అంటే 6 అడుగులు) బోరువేసి చుక్క నీరు కనపడక గుండెలో బండపడిన రైతు వ్యధను చిత్రించాడు. ఈ రోజు నూరు మట్టుల బోర్లు ఇరవై వరకు వేసినా చుక్క నీరు దక్కించుకోలేని స్థితికి అనంతపురం భూగర్భ జలాలు పడిపోయినాయి. ఈ పరిస్థితుల్లో పంటకుంటలు, రెయిన్ గన్నుల ఆర్భాట ప్రచారం ప్రజలను వంచించడం, పరిహసించడం తప్ప వేరుకాదు.

వర్తమానంలో ఎంతటి వర్షాభావ పరిస్థితి ఏర్పడినా గంజి కేంద్రాల ఏర్పాటు అవసరం లేకపోవడానికి కారణం ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాపంపిణీ వ్యవస్థ (రేషన్ షాపులు) విస్తరించి వుండడమే. ఎన్నికల రాజకీయాల అవసరాల రీత్యా పాలక వర్గాలకు దానిని కొనసాగించక తప్పటంలేదు. దాన్ని ఏదో ఒక రీతిగా బలహీనపరచడానికి నరేంద్రమోది ప్రభుత్వం పన్నాగాలు పన్నుతున్నది. ధరల ఆటుపోట్లు వున్నా, ధాన్యాల రవాణా విస్తృతంగా జరుగుతూ అందుబాటులో వుండడం కూడా గంజి కేంద్రాల అవసరం లేకపోవడానికి మరొక కారణంగా వుంది. అయితే ఆధునిక జీవితం తెచ్చిపెట్టిన కొత్త అవసరాలు, కరువు పరిస్థితుల్లో రైతులను, గ్రామీణ పేదలను తీవ్రమైన ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వారిని బలవన్మరణాల వైపు నెడుతున్నాయి. ధాన్యపు పంటల స్థానంలో ఎగుమతి ఆధారిత వ్యాపార పంటల సాగు ఊపందుకోవడంతో పెట్టుబడులు విపరీతంగా పెరగడం, మార్కెట్ ధరలు జూదంగా మారడం రైతులను నష్టాల ఊబిలోకి నెట్టాయి. నాలుగైదు బహుళజాతి గుత్త కంపెనీలు వ్యవసాయోత్పత్తుల ధర వరలను నియంత్రిస్తూ రైతులను దివాలా తీయిస్తున్నాయి. ఇక దీనికి తోడు తీవ్ర వరుస వర్షాభావ స్థితులు దాపురించి రైతును నాగలికి ఉరేస్తున్నాయి.

ఈ పరిస్థితులలో నికర జలాలైనా, మిగులు జలాలైనా నూరు టి.ఎమ్.సి.ల నదీ జలాలను అనంతపురానికి కేటాయించి వాటిని నిలుపుకోగల రిజర్వాయర్‌లను అన్ని మండలాల్లో నిర్మించి వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడం తప్పనిసరి. జిల్లాను ఆయా మండలాల నీటి అవసరాల రీత్యా బ్లాకులుగా విభజించి 1-2 టి.ఎమ్.సి.ల

సామర్థ్యంతో రిజర్వాయర్లను నిర్మించే అవకాశాల ప్రణాళికను జిల్లా నీటి నిపుణులు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్.ఎమ్.భాషాగారు ప్రతిపాదించారు. దానిపై చర్చ జరిపి తగిన మార్పులు చేర్పులు చేసి ఆ నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావల్సిన అవశ్యకత వుంది. ప్రజలను పెద్దఎత్తున సమీకరించి, ఉద్యమంలో ఐక్యతను సాధించుట ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది.

సాగునీరు, నిలకడైన, న్యాయమైన మార్కెట్ అందుబాటులోకి వస్తే రైతులు ఏ రాయితీలు ఆశించరు. బ్యాంకులు, సొసైటీలు ఇస్తున్న నామమాత్రపు రుణాలు రాజకీయ పార్టీల ఎన్నికల పాచికలుగా తప్ప రైతులకు ఒరగబెడుతున్నదేమీ లేదు. వ్యవసాయ రుణమాఫీలు దేశ ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీస్తాయని బ్యాంకు అధికారులు, కేంద్ర ఆర్థికమంత్రి సెలవిస్తున్నారు. దొంగ పారాశ్రామిక వేత్తల ఆరు లక్షల కోట్ల రూపాయల మొండిబకాయిలు దేశ ఆర్థికాన్ని ఎంత క్రమశిక్షణలో పెట్టాయో ఎవరికి తెలియదు? కార్పొరేట్ దొంగల ఒక లక్షా ఇరవై నాలుగు వేల కోట్ల అప్పులను ఏ ఆర్థిక క్రమశిక్షణ కోసం రద్దుచేశారు? పెద్దనోట్ల రద్దు తరవాతనే ఏడు వేల కోట్ల కార్పొరేట్ మోసగాళ్ళ అప్పులను ఎందుకు రద్దు చేశారు? తొమ్మిది వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ బ్యాంకులకు బాకీ వున్న లిక్కర్ మాఫియా విజయ మాల్యా, సుప్రీంకోర్టు మాటల్లోనే, కింగ్ ఫిషర్ మాదిరి లండన్ ఎగిరిపోవడానికి తోడ్పడిన ప్రభుత్వం ఏ ఆర్థిక క్రమశిక్షణనాశించి ఆ పని చేసింది? ప్రభుత్వాలను, బ్యాంకులను నిలదీయడానికి రైతుల వద్ద చాలా ప్రశ్నలే వున్నాయి.

అనంతపురం జిల్లా రైతులు అద్భుతమైన శ్రామికులు. సాగులో, పంట రకాల్లో నిత్య నూతన పరిశోధకులు. వ్యవసాయాన్ని తపస్సులా నిర్వహిస్తారు. కరువుల జడిలో కూడా వారు ప్రదర్శిస్తున్న ఆత్మస్థైర్యం అపురూపమైనది. వారికి అండగా నిలబడడం పౌరసమాజ బాధ్యత. అనంతపురం జిల్లాకు సాగునీరు తగినంత కల్పించడంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ప్రజాస్వామిక ఆలోచనలకు సిద్ధపడాలి. క్షేమం అవిభాజ్యం.

# కరువు మండలాలుగా ప్రకటించారు కానీ సహాయక చర్యలు మరిచారు

**- యస్.యం.బాషా, మానవహక్కుల వేదిక**

**గత** సంవత్సరం అక్టోబర్ మాసంలోనే ప్రభుత్వం ఏమాత్రం తడబాటు లేకుండా అనంతపురం జిల్లాలోని మొత్తం 63 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. అయితే జిల్లా అంతటా సర్వవ్యాపితమైన కరువును గురించి విచారించాలో, ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని ఊరట చెందాలో అర్థం కాని ఒక అనిశ్చిత పరిస్థితి నెలకొనివుంది. ఎందుకంటే కరువు మండలాలుగా ప్రకటించి 5-6 మాసాలు గడిచినా సహాయక చర్యల ఊసే కానరావడం లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే వున్నారు. నిలువునా ఎండిపోతున్న పళ్ళ తోటలను చూసి కుదేలవుతున్న రైతులను కదిలిస్తే విషాదం. మరోపక్క వలసలు కొనసాగుతూనే వున్నాయి. మనుషులకు, పశు వులకు, జీవాలకు తాగునీరు దొరకక, వైద్య సదుపాయాలు లేక ప్రజలు దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నారు. అసలు కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రజల మానాన ప్రజలను వదిలి వేయడమేనా నాగరిక ప్రభుత్వాల పని? ప్రభుత్వ బాధ్యతల గురించి ప్రజల హక్కుల గురించి ప్రశ్నించడం నేర్చుకోలేమా? ఇవన్నీ మనం మనసుపెట్టి ఆలోచించాలి.

కరువు కాలాల్లో ఫ్యామిన్ కోడ్‌లు

కరువులు, వరదలు ప్రకృతి శాపాలు. ఇందుకు ముందుగా బలయ్యేది వ్యవసాయం, రైతులు. వర్షాలు రాకపోయినా పంటలు పండకపోయినా కరువులు ఏర్పడుతాయి. వర్షాలు అధికమై పంటలు వరదల పాలయినా కరువులు ఏర్పడుతాయి. రైతులను కాదన్న ఏ ప్రభుత్వం చరిత్రలో మనలేదు. 14వ శతాబ్దంలో దేశంలోనే కరువులలో రైతులను ఆదుకోవడానికి మొదటి ఫ్యామిన్ కోడ్ రూపొందించిన వాడు దిల్లీని పాలించిన మహ్మద్ బిన్ తుగ్లక్. ఆ తరువాత 1833లో బ్రిటీష్ ప్రభుత్వం ఒక ఫ్యామిన్ కోడ్‌ను రూపొందించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1950లో భారత ప్రభుత్వం ఒకఫ్యామిన్ కోడ్‌ను రూపొందించింది. సగటు వర్షపాతం కంటే 25 శాతం వర్షపాతం తక్కువ కురిసినపుడు కరువు ప్రాంతంగా ప్రకటించవచ్చునని చెప్పింది. దానితో పాటు ఈ క్రింది విషయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని సూచించింది.

- ❖ ప్రజలకు అప్పులు పుట్టకపోవడం
- ❖ ప్రజలలో అసహనం అధికం కావడం, నేరపూరిత సంఘటనలు పెచ్చరిల్లడం

- ❖ మేతకోసం పశువులు, జీవాలు అసాధారణంగా వెంపర్లాడడం
- ❖ సాధారణ ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటడం
- ❖ రైళ్ళల్లో ప్రయాణాలు, తీర్థయాత్రలు బాగా తగ్గిపోవడం
- ❖ సాధారణం కంటే భిన్నంగా ప్రజలు చేయడానికి పనులు లేక ఖాళీగా వుండడం
- ❖ రైతులు అసాధారణంగా తమ వద్ద వున్న బంగారు, వెండి నగలను కుదువ పెట్టడం లేదా అయిన కాడికి అమ్మడం.

2.50 మి.మీ. అంతకంటే ఎక్కువ వర్షపాతం ఒక దినంలో కురిస్తే దానిని ఒక వర్షపు దినంగా పరిగణిస్తారు. సగటున 750 మి.మీ తక్కువ కురిసే ప్రాంతాలలో 15 శాతం 750 మి.మీ. నుంచి 1000 మి.మీ. కురిసే ప్రాంతాలలో 20 శాతం, 1000 మి.మీ. ఆపైన కురిసే ప్రాంతాలలో 25 శాతం తక్కువగా వర్షపాతం నమోదయితే కరువు మండలాలుగా ప్రకటించాలని 1995లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన డ్రాట్ మాన్యువల్ చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి 4-5 సంవత్సరాల కొకసారి కరువు సహాయ కార్యక్రమాలు రూపొందిస్తూ డ్రౌట్ మాన్యువల్స్‌ను విడుదల చేస్తోంది. 2016లో కేంద్ర ప్రభుత్వం విడుదల డ్రవుట్ మాన్యువల్ ఏం చెబుతుందో ఒకసారి పరిశీలిద్దాం.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖాధిపతులతో ఒక రాష్ట్ర స్థాయి కమిటీని నియమించాలి

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సంభవించే కరువు పరిస్థితులను అంచనా వేయడం కోసం డ్రౌట్ మానిటరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మాన్యువల్ సూచిస్తోంది. ఇందులో వాతావరణ శాఖ, మెట్టసాగు, జలవనరుల శాఖల నిపుణులతో పాటు ఇస్రో, రిమోట్ సెన్సింగ్ బృందాల వారు సభ్యులుగా వుంటారు. కరువు ప్రకటిత ప్రాంతాలలో సహాయక చర్యలు అమలు చేయడానికి అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి. ఎప్పుడైతే కరువు మండలాలుగా ప్రకటిస్తారో అప్పటి నుండి ఒకవారం లోపలనే నివేదికను సమర్పించాలని డ్రౌట్ మాన్యువల్ సమయ నిర్దేశాన్ని చేసింది.

## జిల్లాస్థాయిలో సహాయక కార్యక్రమాల అమలు

కరువు సహాయక కార్యక్రమాలు అమలు కోసం కరువు మండలాలుగా ప్రకటించిన వెంటనే జిల్లాస్థాయిలో అన్ని శాఖాధిపతులను సమన్వయం చేస్తూ జిల్లా కలెక్టరు కమిటీని ఏర్పాటు చేయాలి. ఇందులో అధికారులే కాకుండా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పౌరసమాజం నుండి ప్రతినిధులు ఉండాలి. సహాయక చర్యల కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుంది.

### 1) ప్రజలకు పనిదినాలు కల్పించడం

కరువు కాలంలో వ్యవసాయ పనులు లేక, కుటుంబ పోషణార్థం ఇతర ప్రాంతాలకు ప్రజల వలసల్ని నిరోధించడానికి ప్రభుత్వం వెంటనే పనులు కల్పించాల్సి వుంటుంది. పార్లమెంటులో చట్టం చేయడం ద్వారా 2005లో ఏర్పడిన మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకాన్ని (MGNREGS) సమర్థవంతంగా అమలు జరపాలి. అయితే జిల్లాలో గత ఎనిమిది సంవత్సరాలుగా అసాధారణ కరువు పరిస్థితులు నెలకొనివున్న కారణంగా దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోయినారు.

వలస వెళ్లిన వారిని సంప్రదించి వారికి పనులు కల్పించి వెనక్కు రప్పిస్తామని అధికారులు అప్పుడప్పుడూ ప్రకటనలు ఇస్తూ వుండడం ఒక ఆనవాయితీగా మారింది. ఇంతవరకూ ఎవరూ వచ్చిందీ లేదు. వలసలు ఆగనూలేదు.

ఇదిలావుండగా ఉపాధి పనులు కల్పిస్తూ ఆదుకోవాల్సిన ప్రభుత్వం గత సంవత్సరం చేసిన పనులకే వేతనాలు చెల్లించలేదంటే ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో అర్థమవుతుంది. పనులు చేసిన 14 రోజుల లోపలే వేతనాలు చెల్లించాలని, ఆలస్యమయితే వడ్డీతో సహా చెల్లించాలని ఉన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదు. ఇంతటి ఘనకార్యాలు సాధించినందులకే ప్రభుత్వం బదిలీపై వెళ్లిన జిల్లాకలెక్టరు గారికి, ప్రస్తుత ప్రాజెక్టు డైరెక్టరు గారికి అవార్డులు ప్రకటించి సత్కరించింది. ఈ భాగోతమేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం.

| | |
|---|---|
| జిల్లాలో మంజూరు చేసిన జాబ్‌కార్డులు | 6,54,133 మందికి |
| ఆధార్‌తో అనుసంధానం అయినవి | 4,59,281 మందికి |
| ఆధార్‌తో అనుసంధానం కానివి | 1,94,852 మందికి |
| ప్రస్తుతం పని కల్పించినది | 2,76,259 మందికి |
| సరాసరి పని కల్పించిన దినాలు | 62 రోజులు |
| 2016-17 సంవత్సరానికి (గత సంవత్సరం) | |
| ప్రభుత్వం ఇంకా చెల్లించాల్సినది | రూ॥ 61,31,91,516 |
| 2017-18 సంవత్సరానికి చెల్లించాల్సినది | రూ॥ 9,13,59,643 |
| మొత్తం కూలీలకు చెల్లించాల్సినది | రూ॥ 70,45,90,858 |

**100 రోజులు పని చేసినది:**

| | |
|---|---|
| 2014-15లో | 15.22% |
| 2015-16లో | 31.92% |
| 2016-17లో | 26.06% |

సగటున గిట్టుబాటు దినసరి వేతనం రోజుకు 60/- నుండి 120/- వరకు

దాదాపుగా 70 కోట్ల రూపాయలకు పైబడి ఇదివరకే బకాయిలు పడిన ప్రభుత్వం, ఇప్పుడు కరువు సహాయక కార్యక్రమాల్లో కొత్తగా ఏవిధంగా పనులు కల్పించగలదో ప్రభుత్వానికే తెలియాలి. బకాయిలు చెల్లించాలని అధికారుల చుట్టూ తిరగడం, అధికారులు విసుక్కోవడం, చివరకు బ్యాంకుల వద్దకు వెళితే వారు కూడా కసురుకోవడం ప్రజల నిత్య అనుభవం. ఎవరిని అడగాలో చేసిన కూలీ డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. కూలి డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిన గోవిందప్ప (35) అనే కూలీ అడదాకులపల్లి, పెనుకొండ మండలానికి చెందినవాడు 03.04.2017న తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఒంటినిండా డీజిల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మానవీయ స్పర్శజ్ఞానం కోల్పోయిన అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదు. అమాత్యుల, రాజకీయ నాయకుల సేవా కార్యక్రమాల్లో మునిగితేలే అధికారులకు

సామాన్యుల బాధలు అర్థమవుతాయా? బ్యాంకులలో ఆధార్ నమోదు కాలేదన్న కారణాన చాలామంది వేతనాలు నిలుపుదల చేశారు. ఎందుకు నమోదు కాలేదో చూడాల్సిన బాధ్యత అధికారులది. బాధ్యతలు లేవు. మానవత్వం అంతకన్నా లేదు. సుప్రీంకోర్టు ఆధార్ ప్రామాణికం కాదని హెచ్చరిస్తున్నా అధికారుల తీరుమారదు.

ఉపాధి వేతనాల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు జరుగుతూనే వున్నాయి. ధర్నాలకు, శాంతియుత నిరసనలకు కాలం చెల్లిపోయిందన్నట్లుగా అధికారుల తీరు స్పష్టం చేస్తున్నది. ఒకరిద్దరు వస్తే మాట్లాడించరు. 10 మంది ఆపైనవస్తే, పోలీసులు తరుముతారు. ఎవరిని అడగాలో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొనివుంది. అధికార పార్టీ నాయకుల వద్ద మాత్రమే అధికారుల కళ్లు, చెవులు పనిచేస్తాయని ఒకానొక జరిగిన సంఘటన చెబుతోంది. ఈ మధ్య తన ఇలాకాలో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఒక అధికార పార్టీ శాసనసభ్యుడు కోరాడు. ఫలితం లేనట్లుంది. ఆగ్రహించిన ఆ శాసనసభ్యుడు జిల్లా కేంద్రంలో చేస్తానని ప్రకటించాడు. అంతే సదరు అధికారులు శాసనసభ్యుని ఇంటికే వెళ్లి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇచ్చినట్లుగా వార్తా పత్రికల్లో వచ్చింది. శాసనసభ్యుల ధర్నాలకయితే విలువ ఉంది కానీ సామాన్యుల ధర్నాలకు, నిరసనలకు విలువ ఎక్కడుంది? అందుకే ఇకనుంచి ఉపాధి కూలీలు ఏ ప్రాంతానికి చెందిన వారు ఆ ప్రాంతం ప్రజాప్రతినిధి వద్ద తమ నిరసలు తెలియజేస్తే, ఎవరో ఒక ప్రజాప్రతినిధికి దయగలిగి ధర్నా చేస్తే, ఉపాధి కూలీ బకాయిలు చెల్లింపులు జరుగుతాయేమోనన్న ఆశ.

## 2) గ్రామాలలో మంచినీటి సౌకర్యాలు కల్పించడం

డ్రౌట్ మాన్యువల్ ప్రకారం, మనుషులకు పశువులకు అవసరమైన మంచినీటి సరఫరా కోసం చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. కరువు మండలాలుగా ప్రకటించిన వెంటనే ముందుగా ఈ వరకే అందుబాటులో వున్న నీటి వనరుల సామర్థ్యాన్ని లెక్కగట్టాలి. ఆ తరువాత మొత్తం ప్రజల దైనందిక జీవితంలో అవసరమయ్యే నీటిని గూర్చి అంచనాలు రూపొందించాలి. జిల్లాలో లభ్యమయ్యే అన్ని ప్రయివేట్, ప్రభుత్వ నీటివనరులను జిల్లా యంత్రాంగం తన స్వాధీనంలోనికి తీసుకోవాలి. సాధ్యమయినంత వరకూ గ్రామాలకు పైపులద్వారానే నీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలి. సాధ్యం కానీ పరిస్థితులలో మాత్రమే తీవ్రతను బట్టి రోడ్డు రవాణా, రైలు మార్గాల గుండా నీటిసరఫరాను చేపట్టాలి.

వాస్తవానికి జిల్లాలో ప్రస్థుతం నెలకొని ఉన్న తాగునీటి ఎద్దడి ఊహించరానిదేం కాదు. ప్రతి సంవత్సరం ఈ పరిస్థితులు దాపురిస్తూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులలో ఏమాత్రం ఆలోచన కలిగిన ప్రభుత్వాలయినా శాశ్వత పరిష్కారాల వైపు ఆలోచిస్తాయి. ముఖ్యమంత్రిగారు 2015 లోనే అనంతపురం జిల్లాలోని ప్రతి గ్రామానికి వాటర్ గ్రిడ్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కానీ ఎందుకనో చాలా సౌకర్యంగా ఈ వాగ్దానాన్ని మరచిపోయారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరాగావిస్తే ప్రజల ఆరోగ్యాలు గాలికిపోయినా రాజకీయనాయకుల, అధికారులకు కూడికలు, తీసివేతలు నేర్పుతున్నాయి. అందుకే తాత్కాలిక లాభాల కోసం తప్ప శాశ్వత పరిష్కారాల వైపు ఎవరూ ఆలోచించడం లేదు.

ఈ జిల్లాలో చెరువుగానీ, కుంటగానీ లేని గ్రామమే లేదు. ఇవన్నీ గొలుసుకట్టు పద్ధతిలో అనుసంధానమై ఉన్నాయి. అధికారుల అండదండలతో రాజకీయ నాయకుల, బడాబాబుల ఆక్రమణలో వున్న చెరువుల్ని, కుంటల్ని, సప్లయ్ ఛానల్లకు విముక్తి కలిగించాలి. ఉపరితల నీటితో వీటిని నింపితే తాగునీ రిజర్వాయర్లుగా ఉపయోగపడుతాయి. ప్రభుత్వానికి పెద్దగా ఖర్చు కూడా వుండదు.

### 3. ఆహారభద్రత

కరువు ప్రకటిత ప్రాంతాలలో ఆహార భద్రతను గూర్చి డ్రౌట్ మాన్యువల్ నొక్కి చెబుతోంది. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం 75 శాతం గ్రామీణ ప్రాంత ప్రజలకు 50 శాతం పట్టణ ప్రాంత ప్రజలకు ఆహార భద్రతను సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. గ్రామాలలో ఆహార భద్రతా చట్టం పరిధిలోకివచ్చే అన్ని కుటుంబాలను జిల్లా యంత్రాంగం గుర్తించాలి. ప్రజా పంపిణీ పథకం ద్వారా ఆహార పదార్థాలు ప్రజల అందుబాటులోకి తేవాలి. ఏ ఒక్క కుటుంబం కూడా మినహాయింపు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలి. ఒకవేళ ఎవరికైనా రేషన్‌కార్డు లేకపోతే వెంటనే ఇవ్వడానికి ఏర్పాటు చేయాలి. అంతవరకూ ఇతరత్రా ఆధారాలను పరిగణనలోనికి తీసుకొని ఆహార పదార్థాలు పంపిణీ చేయాలి. రేషన్‌కార్డులలో ఎవరైనా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కాకపోతే అధికార యంత్రాంగం గుర్తించి వెంటనే రేషన్‌కార్డులు సవరించి ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ సరుకులు అన్యాక్రాంతం కాకుండానూ, పక్కదారులు పట్టకుండానూ జాగ్రత్తలు పాటించాలి.

కరువు మండలాలుగా ప్రకటించి ఆరు నెలల కాలం కావస్తున్నా, ఆహార భద్రతా చట్టాన్ని గురించి ప్రభుత్వంగానీ, జిల్లా యంత్రాంగం గానీ పట్టించుకోనేలేదు. కనీసం గ్రామాలలో సర్వేలు కూడా నిర్వహించనట్లు వార్తలు తెలియరావడం లేదు. పార్లమెంట్ ద్వారా చేయబడిన చట్టాల పట్లే ప్రభుత్వాలు, అధికారులు ఏవిధంగా బాధ్యత వహిస్తున్నారో ఇది చూస్తే అర్థమవుతుంది.

### 4) పౌష్టికాహారం పంపిణి:

డ్రౌట్ మాన్యువల్ సూచిస్తున్న మరొక ప్రాధాన్యతాంశం 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం సరఫరా. ఇందుకోసమే 1975లో ఐ.సి.డి.యస్ పథకాన్ని దేశంలో ప్రవేశ పెట్టినారు. అంతేకాకుండా పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలు కూడా ప్రభుత్వాలవే. కరువు పరిస్థితుల నేపథ్యంలో పిల్లలతో పాటు వృద్ధులు, అంగవైకల్యం కలిగినవారు, మహిళలు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఆహారం అందించడానికి సామాజిక వంట కేంద్రాలను ప్రారంభించాలని డ్రౌట్ మాన్యువల్ నిర్దేశిస్తూ ఉంది. పూర్తిగా ప్రభుత్వం ద్వారాగానీ, స్వచ్ఛం సంస్థల సహాయ సహకారాల వల్ల గానీ, సామాజిక వంట కేంద్రాలు నెలకొల్పాలి. కరువు పరిస్థితులు పూర్తిగా నిష్క్రమించే వరకూ ఈ వంట కేంద్రాలను కొనసాగించాలి.

ప్రభుత్వం పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం శెలవులలో కూడా కొనసాగింపులో భాగంగా "కరువుబువ్వ" పేరుతో బియ్యం వగైరా ఇస్తామంటోంది. ఆచరణలో దానిని అసాధ్యంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కరువు బువ్వ

కోరుకునే పిల్లలందరూ ఆధార్‌కార్డు నెంబరును తెలియపరుస్తూ దరఖాస్తు చేసుకోమన్నారు. వేసవి శెలవులలో తలోదారి వెళ్లిపోయిన ఉపాధ్యాయులు, పిల్లలు కలిసేదెన్నడు? పిల్లలపేర్లు పంపెదెన్నడు? ఇపుండేదో సడలింపులు ఇచ్చినట్లున్నారు. ఈ రకంగా అధికారుల మధ్య చర్చా, మీమాంసలు ముగిసేటప్పటికి తిరిగి పాఠశాలలు మొదలవుతాయి. చివరికి కరువుబువ్వల నివేదికలు మాత్రం పిల్లలతో సంబంధం లేకుండానే వారిపేర్లతో నివేదికలు సిద్ధమవుతాయి. పోయినేడాది ఇదే తంతు నడిచింది.

ఇంతేకాకుండా గ్రామాలు, తండాల నుంచి చాలామంది వలస వెళ్లడం వలన వృద్ధులు, పిల్లలు ఆలనాపాలనా లేకుండా ఉన్నారు. వారి భోజన సదుపాయాల నిమిత్తం సామాజిక వంటశాలలు లేదా గంజికేంద్రాలయినా ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ నిధులు సకాలంలో రాకున్నా శ్రీమంతుడు సినిమాలో లాగా సమాజానికి తిరిగి ఇవ్వడాన్ని అధికారులు, రాజకీయ నాయకులు అలవాటు చేసుకోవాలి. లేకుంటే అవనసరంగా లావెక్కిపోతారు.

## 5. నిస్సహాయులకు ఆర్థికసహాయం

కరువు మాన్యువల్ ప్రకారం కరువు మండలాలుగా ప్రకటించిన వెంటనే జిల్లా కలెక్టరు గ్రామాలను గురించి సర్వే చేయించాలి. ప్రతి గ్రామంలోనూ ఏ ఆదరువు లేని నిస్సహాయ కుటుంబాలను గురించి వివరాలు సేకరించాలి. గ్రామంలో వృద్ధులు, అంగవైకల్యం కలిగిన వారు, నిస్సహాయులను గుర్తించి రాష్ట్రప్రభుత్వపు మార్గదర్శకాల ననుసరించి వారికి నగదు రూపంలో గానీ, ఆహార పదార్థాల రూపంలో గానీ సహాయం అందజేయాలి. మారుమూల గ్రామాలలో సైతం తిండిగింజల నిధులు ఏర్పాటు చేయాలి. (Grain Banks) ఇందుకోసం వినియోగించే నిధులు ప్రకృతి వైపరీత్యాల నిధుల నుండి తీసుకోవాలి.

## 6. కరువుల కాలంలో రుణమాఫీలు – రాయితీలు:

కరువు ప్రాంతాలుగా ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను, కరువు తీవ్రతలను పరిగణనలోనికి తీసుకొని సహాయ కార్యక్రమాలు రూపొందించాలి.

- ❖ కరువు ప్రాంతాలలో భూమిశిస్తులు మాఫీ చేయాలి
- ❖ రైతులు చెల్లించాల్సిన తక్కావి, నీటి తీరువాలు, కరెంటు ఛార్జీలు, వ్యవసాయ రంగానికి చెందిన ఇతరత్రా చెల్లింపులను వాయిదా వేయాలి. రైతుల నుండి బలవంతపు వసూళ్ళకు పాల్పడరాదని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులివ్వాలి.
- ❖ రైతులు, బ్యాంకులకు, ఇతర సంస్థలకు చెల్లించాల్సిన స్వల్పకాల వ్యవధిరుణాలు, దీర్ఘకాలిక వ్యవధి రుణాలను వాయిదా వేయాలి. రుణాలను రీ–షెడ్యూలు చేయాలి.
- ❖ కరువు ప్రాంతాలలోని విద్యార్థులకు విద్య / పరీక్ష ఫీజులను రద్దుచేయాలి.
- ❖ ప్రభుత్వం 2017–18 సంవత్సరానికి పంటరుణాలు రీ–షెడ్యూల్ మొదలు పెట్టినట్లు ఈ వారమే ప్రకటించింది. అయితే బ్యాంకులు విముఖత చూపుతుండడంతో రైతులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు.

కనీసం కరువు పరిస్థితులలోనైనా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ గానీ, బీమా గానీ ఇవ్వలేదు. 20.04.2017న జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి 1030 కోట్ల పంట నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు ఆ ప్రయత్నాలే మొదలు కాలేదు. ఇంతవరకూ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఒకదానికొకటి సంబంధం లేకుండా చెల్లించేవారు. మొదటిసారిగా ప్రభుత్వం రెండింటినీ కలిపి ఇస్తామని ప్రకటించింది. అది కూడా ఎకరాకు 6 వేలు ఇస్తాననింది. వేరుశనగ పంటకే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎకరాకు 20 వేలు వుంది. బ్యాంకు రుణం తీసుకొన్న ప్రతిరైతు నుంచీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే 270 కోట్లు ప్రీమియం రైతులు చెల్లించినారు. బీమా మొత్తం మూడు వేల కోట్లు రావాలి. జిల్లాకు వచ్చింది కేవలం 360 కోట్లు మాత్రమే. బజాజ్ అలయంజ్ కంపెనీ నుంచి బీమా మొత్తాన్ని వసూలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తున్నదో తెలియదు. చివరికి కరిమింగిన వెలగపండులాగా పంటనష్టపరిహారం / బీమా రాబోతున్నది.

**7. పశువుల క్యాంపులు – మేత సరఫరా**

గ్రామీణార్థిక రంగంలో పశుసంపద చాలా ప్రధానమైనది. దాదాపు 80 శాతంగా వున్న సన్న చిన్నకారు రైతాంగానికి పశుసంపద పెద్ద ఆలంబన. కరువు కాలంలో పశు సంపదను కాపాడడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని డ్రౌట్ మాన్యువల్ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. కరువు మండలాలు ప్రకటించిన వెంటనే జిల్లా కలెక్టరు జిల్లాలో అందుబాటులో ఉన్న పశుగ్రాసం, ఎంత మేరకు అవసరమయ్యేది అంచనాలు రూపొందించాలి. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వానికి సవివరమైన నివేదికలు పంపాలి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకలెక్టరు పశువుల క్యాంపులు నిర్వహించడానికి, పశువుల మేత కొనుగోలు చేయడానికి పూర్తి స్వేచ్ఛ నివ్వాలి. జిల్లాలోని పశువుల మేత జిల్లా సరిహద్దులు దాటిపోకుండా జిల్లా కలెక్టరు చర్యలు తీసుకోవాలి.

కరువు మండలాలుగా ప్రకటించిన తరువాత కూడా జిల్లా నుండి నిరాటంకంగా పశువుల మేత ఇతర ప్రాంతాలకు తరలిపోతూనే ఉండడం అధికారుల ఉదాసీనతకు పరాకాష్ట.

ఈ లోగా జిల్లా యంత్రాంగం 6వేల టన్నుల (సైలేజ్) మాగుడు గడ్డిని జిల్లా యంత్రాంగం దిగుమతి చేసుకుంది. ప్రభుత్వం మాగుడు గడ్డిని కేజి 6.80 కే కొనుగోలు చేసి సబ్సిడీపై రైతుకు రూ॥ 2/- లు వంతున సరఫరా చేస్తోంది. అధికారుల మాటలు నమ్మి వేల రూపాయలు ఖర్చుపెట్టి ఈ గడ్డి కొనుగోలు చేసిన రైతుల తీవ్రంగా నష్టపోయారు. గడ్డిమూటలు విప్పి చూస్తే గడ్డి కుళ్లి పోయి దుర్వాసన వేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ గడ్డి తింటే పశువుల ముక్కుల్లో రక్తం కారడంతో పాటు, అజీర్తి రోగాలు కూడా వస్తాయని కొంతమంది పశువైద్యులే చెబుతున్నట్లుగా పత్రికలలో వార్త (ఆంధ్రజ్యోతి 03.05.2017) అయితే అధికారులు రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మాత్రం చెబుతున్నారు. కరువు సహాయక కార్యక్రమాలు ఈ విధంగా కూడా సాగుతాయి.

**8. వైద్య సౌకర్యాలు**

కరువు ప్రాంతాలలో నీటి అధారిత జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది గనుక ప్రభుత్వం ప్రత్యేకించి దృష్టిసారించాలని డ్రాట్ మాన్యువల్ సూచిస్తోంది. నీటి వనరులలో తరచుగా క్లోరినేషన్ చేస్తూవుండాలి. అంటువ్యాధులు ప్రబలే అవకాశం

వుంది గనుక ప్రత్యేక వైద్య టీములను ఏర్పాటు చేయాలి. కరువు ప్రాంతాలకు అవసరమయ్యే మందులను సేకరించి జిల్లా కేంద్రంలో నిలువ వుంచాలి.

చాలా అస్తవ్యస్తంగా వున్న శాఖల్లో ఆరోగ్యశాఖ ఒకటి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో వున్న పి.హెచ్.సి లకు మందుల సరఫరా వుండదు. మందులుంటే సిబ్బంది ఉండరు. ప్రజలకు జబ్బులస్తే ప్రైవేట్ వైద్యం మీద ఆధారపడాల్సిందే. ప్రైవేట్ వైద్యం గ్రామీణ ప్రాంతాల ప్రజల మూలుగుల్ని పీల్చిపిప్పిచేస్తున్నది. ఎంతో కష్టపడి వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వస్తే, ఈ ఆసుపత్రి వైద్యులు కర్నూలు, బెంగుళూరు, హైదరాబాద్ పొమ్మంటారు. వైద్యం ఒక మాఫియాగా మారిపోయింది. జిల్లాలోని చాలా తండాలలో ఇళ్ల వద్ద వృద్ధులు, పిల్లలు మాత్రమే వుంటారు. వారికి చిన్న జ్వరం వచ్చినా ఆదుకొనే నాథుడులేడు. వాస్తవానికి జిల్లావ్యాప్తంగా 5-6 మొబైల్ మెడికల్ వ్యానులు వారానికి ఒక రోజు ప్రతి గ్రామం పోయివచ్చే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సివుండింది. కానీ ప్రజలు కేవలం ఓటుకు పనికొచ్చే సాధనాలుగా మాత్రమే భావించే నాయకులున్నతవరకూ పరిస్థితి మారదు.

## ముగింపు:

ప్రభుత్వం తాను రూపొందించిన చట్టాలు, మార్గదర్శకాలను తానే ఉల్లంఘిస్తోంది. కరువు కాలంలోనూ బతికే హక్కు అందరికీ వుంది. ప్రభుత్వ సాయం పొందే హక్కు కూడా అందరికీ ఉంది. ఈ హక్కుల ఉల్లంఘన మానవ హక్కుల ఉల్లంఘనగానే పరిగణించాలి. కరువు పరిస్థితులలో ప్రజలను రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ చూపిస్తున్న నిర్లక్ష్యం క్షమించరానిది.

**అనంతపురము**

05.05.2017

# రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆందోళనకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) సంఘీభావం

**(రాయలసీమ నాలుగు జిల్లాలలోని అన్ని ముఖ్య కేంద్రాలలో ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు)**

**కరమెత్తి, గళమెత్తి పిలుస్తూంది సీమ**
**శిరమెత్తి, పరుగెత్తి రావోయి నేస్తం**
**రండి....ప్రజా సత్యాగ్రహంలో పాల్గొనండి...రాయలసీమ ప్రజాస్వామిక చట్టబద్ధ నీటి హక్కులకై ఎలుగెత్తి చాటండి...**

– ప్రకృతి రాయలసీమకు అన్ని వనరులను సమకూర్చింది. అన్ని రకాల పంటలను పండే భూమిని, వాతావరణాన్ని, పంటలకు ప్రాణ ప్రదమైన నీటిని అందించే కృష్ణ, కృష్ణా ఉపనదులైన తుంగభద్ర, వేదవతి, హంద్రీ నదులు మరియు పెన్నా, పెన్నా ఉపనదులైన చిత్రావతి, కుందు నదుల ద్వార సంవత్సరాలనికి వెయ్యి శతకోటి ఘనపుటడుగుల పైనే ప్రవహాన్నీ, అన్నింటికి మించి కష్టపడేతత్వంగల మానవ వనరులను, సాంప్రదాయ వ్యవసాయానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను అత్యంత మెలుకవలతో జోడించి అన్ని రకాల పంటలను, విత్తనోత్పత్తి చేయకల్గిన విశిష్ట రైతాంగాన్ని ఈ పుణ్యభూమికి ప్రకృతి ప్రసాదించింది.

– కాని ప్రభుత్వ అప్రజాస్వామిక నీటి పంపిణి విధానాల వలన, ఏపాలకుల నిర్లక్ష్యంవలన, కృష్ణా జలాల పంపిణీలో రాయలసీమ తీవ్ర వివక్షకు గురైంది. 1965వ సంవత్సరంలో ఏర్పడిన కృష్ణా నది జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్–1(బచావత్ కమీషన్) ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయ యోగ్యభూమిలో 45.37 శాతం వ్యవసాయ యోగ్య భూమి వున్న రాయలసీమకు కృష్ణా నీటిలో కేవలం 16.5 శాతం హక్కుగా కేటాయించింది. అత్యల్ప వర్షపాతం పడే ప్రాంతానికి అత్యంత తక్కువ నీటిని కేటాయించింది. అధిక వర్షపాతం ఉన్న కృష్ణాజిల్లాకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలే, సహజ వనరులను దోచుకొనేందుకు అవకాశం కల్పించింది.

– అత్యంత అప్రజాస్వామికంగా అత్యల్పముగా రాయలసీమకు కేటాయించిన కృష్ణాజలాలలో కూడా 60 శాతానికి మించి నీరు వాడుకొనలేకపోతున్నాం. ఈ ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని సంపూర్ణంగా వాడుకొనడానికి మరియు నీటి విడుదల/నిలుపు తేదీలను మరియు ఖచ్చితమైన విడుదల దినాలను రైతులకు తెలియచేసి వారు

నష్టపోకుండా సక్రమముగా పంటలు పండించుకోవడానికి స్థిరీకరణ ప్రాజెక్టులను నిర్మింపచేయలేదు. అదే సందర్భములో కృష్ణా డెల్టా స్థిరీకరణకు పులిచింతల, పట్టిసీమ, పోలవరంతో కలసి 6 స్థిరీకరణ ప్రాజెక్టులు చేపట్టడం గమనిస్తే వెనకపడిన ప్రాంతాల పట్ల పాలకుల వివక్ష స్పష్టమవుతుంది.

– కృష్ణా నది మిగుల జలాలమీద నిర్మిస్తున్న గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టులను రాష్ట్రవిభజన బిల్లోలు పూర్తిచేస్తామని ప్రకటించారు. కాని కేంద్రప్రభుత్వం నియమించిన రెండవ కృష్ణా నది వివాదాల నివారణ ట్రిబ్యునల్–2 (బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్) కృష్ణా నదిలోని మిగులు జలాలను కూడ మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్(తెలంగాణతో సహా) కు పంచివేసింది. ఇంకొక మాటలో చెప్పాలంటే ఈ ప్రాజెక్టులకు అందించడానికి కృష్ణా నదిలో నిఖర జలాలు కాదుకదా, మిగులు జలాలూ లేవు.

– రాష్ట్ర విభజనకు ముందే నిర్మాణంలో వున్నా దుమ్మగూడెం–నాగార్జున సాగర్ టైల్ పాండ్ ప్రాజెక్టును రాష్ట్రవిభజన బిల్లులో చేర్చలేదు. దీని ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్ళించడంవలన 165 టిఎంసిల కృష్ణా జలాలు ఆదా అయ్యేవి. ఈ ప్రాజెక్టను రాష్ట్రవిభజన బిల్లులో చేర్చకపోవడంవలన, నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు భవిష్యత్తు ప్రశ్నార్థకమైన ఏ రాజకీయ పార్టీ పట్టించుకోలేదు.

– రాష్ట్రవిభజన బిల్లోలు గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తిచేస్తామని ప్రకటించిన ఈ ప్రాజెక్టులను పూర్తి చెయ్యడానికి తగిన నిధులను ఎవరు కల్పిస్తారో స్పష్టం చేయలేదు. రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాజెక్టుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వాన్ని అడుగకపోగా, తాను తగినంత నిధుల కేటాయింపులు చెయ్యడంలేదు.

– కేంద్రప్రభుత్వ నిధులతో పూర్తిఅయ్యేలా రాష్ట్రవిభజన బిల్లులో అనుమతులు పొందిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర నిధులు పొందుతున్నప్పటికి, రాష్ట్రబడ్జెట్ నుండి కూడా అత్యధిక నిధులను ఈ ప్రాజెక్టుకు మళ్లించడమే కాకుండా, కరువు పీడిత ప్రాంతాలకు ఏఐబిపి, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన క్రింద కేటాయించిన నిధులను నూతన రాష్ట్రం ఏర్పడిన నాటినుండి నేటి వరకు ఈ ప్రాజెక్టుకు మళ్లిస్తూ, రాయలసీమ ప్రాజెక్టులపట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

–రాయలసీమను సుస్థిర నివాసయోగ్యముగ చేసుకోవాలంటే అందుకు కావలసిన నీరు, నిధులకు అనేక మార్గాలున్నాయి.

– కృష్ణాజలాలను పునఃపంపిణి చెయ్యడంద్వారా 54 టిఎంసిలను రాయలసీమకు అదనంగా కేటాయించవచ్చు. కావున నాడు 6 నెలల పంటకాలం వున్నా వరికి బదులుగా నేడు 4 నెలల పంట కాలమున్న నూతన పరికరాలను చేపట్టడంద్వారా ఆదా అయ్యే నీరు మరియు పులిచింతల నిర్మాణం ద్వారా కృష్ణానది నీటి నిర్వహణలో కలిగిన సౌలభ్యంతో కృష్ణాజలాలను పునఃపంపిణి చెయ్యాలి.

– గోదావరి నుండి కృష్ణాకు మళ్లిస్తున్న నీటిద్వారా ఆదా అవుతున్న కృష్ణా జలాలు 77 టిఎంసి(పోలవరం/పట్టిసీమ ద్వారా–45 టిఎంసి+చింతలపూడి ద్వారా–32 టిఎంసి) ద్వారా రాయలసీమను ధాన్యాగారం చేస్తామంటుంది ప్రభుత్వం. ఈ నీటిని

చట్టబద్ధంగా రాయలసీమకు కేటాయించాలి. అందుకు తగినట్టుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యాలి.

– బ్రిజేష్ కుమార్ శ్రీశైలం రిజర్వాయర్‌కు కేటాయించిన 60 టిఎంసి క్యారి ఒవర్ నీటిని (30 టిఎంసిల నిఖర జలాలతోపాటు) రాయలసీమకు కేటాయించడానికి ప్రభుత్వం ప్రతిపాదనలను చేసి, రాయలసీమకు చట్టబద్ధంగా కేటాయింపులు కలుగచెయ్యాలి.

– రాష్ట్రవిభజన బిల్లును పునఃసమీక్షించి దుమ్ముగూడెం–నాగార్జున సాగర్ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి. దీనిద్వారా ఆదా అయిన 165 టిఎంసిల కృష్ణా జలాలను రాయలసీమకు చట్టబద్ధంగా కేటాయించాలి.

– శాశ్వత నీటి వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టింది. గతంలో కృష్ణానది నీటి వివాదాల పరిష్కార ట్రిబ్యునల్‌లో కరువు పీడిత ప్రాంతాలకు జరిగిన అన్యాయం పురావృతం కాకుడదంటే ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న శాశ్వత నీటి వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ కరువు పీడిత ప్రాంతాలలో త్రాగునీటికి మరియు ఒక్క ఆరు తడి పంటకైనా అవసరమైన నీటి కేటాయింపులు జరిపేలగా విధానాలను పొందపరచాలి.

– రాయలసీమకు సాంప్రదాదయ జల వనరులైన చెరువల పునుద్ధరణ, నిర్మాణం, వాగులు, వంకలు, నదులతో అనుసందానానికి రాయలసీమలో ప్రత్యేక నిధులతో, అధికారాలతో, నిర్దిష్ట సమయ లక్ష్యంతో ఒక చట్టబద్ధ సాగునీటి కమీషన్ ఏర్పాటుచెయ్యాలి.

– శ్రీశైలం రక్షణకై తుంగభద్ర వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని ఎక్స్పర్ట్స్ కమిటి నివేదిక ఇచ్చింది. ఆర్ డి ఎస్ నిర్మాణానికి బ్రిజేష్ కమిటి నీటి కేటాయింపులను చేసింది. ఈ రెండింటిని కలిపి ఆర్ డిఎస్‌తో పాటు తుంగభద్ర వరద కాలువ నిర్మాణం మ్యాలిగన్నూరు నుండి కొత్తపల్లి వరకు చేపట్టితే శ్రీశైలం ప్రాజెక్టుకు రక్షణ కల్పించడమేకాకుండా రాయలసీమకు తుంగభద్ర వరద జలాలను మళ్ళించడం ద్వారా హంద్రి–నీవాతో సహా, రాయలసీమలోని అనేక ప్రాజెక్టులకు మరియు చెరువులకు నీల్లందించకలిగే రాయలనఅసీమ వరప్రదాయిని అయిన ఈ ప్రాజెక్టును చేపట్టాలి.

– రాయలసీమలోని ప్రతి జిల్లాకు కనీసం 100 టిఎంసిలు, మొత్తంగా రాయలసీమకు 400 టిఎంసి కేటాయింపులకు పొందేందుకు వున్న పై అవకాశాలను రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టాలి.

– నీటి కేటాయింపులున్న హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి, కెసి కెనాల్, భైరవాని తిప్ప, ఎస్ ఆర్ బిసి, తెలుగుగంగ ప్రాజెక్టులకు నీరు సక్రమంగా అందడానికి అవసరమైన తుంగభద్ర ఎగువ సమాంతరకాలువ, గుళ్యందగ్గర వేదవతిపై ఎత్తిపోతల పథకం, గుండ్రేపుల రిజర్వాయర్, రాజోలి, జోలదరాసి రిజర్వాయర్లు, హంద్రీ–నీవా నుండి ఎత్తిపోతల పథకం, గోరుకల్లు రిజర్వాయర్, సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలి.

– శ్రీశైలం గేట్లు తెరిస్తే రాయలసీమకు నీరు రాదు. గేట్లు మూస్తేనే నీరు ఎగదన్ని ప్రాజెక్టు వెనుకభాగములో నీరు నిలువ వుంటేనే హంద్రి–నీవా, ఎస్ అర బిసి,

తెలుగుగంగ, గాలేరు–నగరి, కెసి కెనాల్‌కు నీరు లభిస్తుంది. కావున శ్రీశైలం ప్రాజెక్టు కనీస నీటిమట్టం 854 అడుగులకు పునరుద్ధరించాలి.

– పట్టిసీమ నిర్మాణంతో కృష్ణా డెల్టాకు శ్రీశైలం ప్రాజెక్టుతో అనుబంధం తెగిపోయింది. కావున నాగార్జునసాగర్ ఆయకట్టుకు కేటాయించిన నీటి పరిణామం వరకు మాత్రమే శ్రీశైలం రిజర్వాయర్‌లో 875 అడుగులపైన వున్నప్పుడే నీరు విడుదల చేసేలాగ విధానాలు రూపొందించాలి.

– రాయలసీమ ప్రాజెక్టులకు రాష్ట్రప్రభుత్వ నిధులలో ప్రాధాన్యతను ఇవ్వాలి. కరువు పీడిత ప్రాంతాలకు ఏఐబిపి, ప్రధానమంత్రి కృషి సించాయియోజన క్రింద కేటాయించిన నిధులను రాయలసీమ ప్రాజెక్టులకు ఖర్చుచెయ్యాలి. రాష్ట్రవిభజన బిల్లులో పొందపర్చిన ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వ నిధులును రాష్ట్రప్రభుత్వం సాధించాలి.

## సీమ ప్రజలారా, ఇతర ప్రాంతాల ప్రజాస్వామ్యవాదులారా!

– అధికారపక్షం రాయలసీమకు చట్టబద్ధ నీరు, నిధుల కేటాయింపులపట్ల వివక్షను ప్రదర్శిస్తున్నది. నిరాశ నిస్పృహలకు లోనై తమ జీవన మరణ సమస్య అయిన నీటి గురించి కూడా గళమెత్తలేని, వెనుకబడిన రాయలసీమపట్ల అన్ని రాజకీయ పార్టీలు అంతే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తున్నాయి. రాజకీయ పార్టీలన్నీ అభివృద్ధిచెందిన, నోరున్న కృష్ణా, గుంటూరుజిల్లా సేవలో తరిస్తూ తమ రాజకీయలబ్ధికోసం రాయలసీమ భవిష్యత్తును పణంగా పెడుతున్నాయి.

నండి...ఎన్నాళ్ళీ ఈ అన్యాయాన్ని సహిద్దాం...మన మౌనమే మనకు శాపం....మన న్యాయమైన కోర్కెలను వ్యక్తపరుద్దాం....మన జన్మభూమిని రక్షించుకునే చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం...31 మార్చి ప్రజాసత్యాగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం...రాయలసీమ పునర్ నిర్మాణములో భాగస్వాములవుదాం...సీమసత్తా చాటుదాం...సంఘటిత శక్తితో తాగు నీరు, సాగునీరు సాధిద్దాం...

నీటి భిక్షకై యాచన కాదిది...నీటి హక్కుకి జరిపే సంగ్రామం, సంగ్రామం...ఉప్పెనలా ఉరికి రండి, ఊరు వాడ యేకమై... కదంతొక్కు వేళయ్యింది, కదిలి రండి దండులాగా...

**రాయలసీమ సాగునీటి సాధన సమితి**

# రాయలసీమ సాగునీటి సాధన సమితి

**25/510, శ్రీనివాస నగర్, నంద్యాల-518501, 9848040991,**
rjac1913@gmail.com.rayalaseema.jac

**రాయలసీమ చట్టబద్ధ నీటి హక్కు సాధన కార్యక్రమం-2017**
**రాయలసీమ చట్టబద్ధ సాగునీటి సాధన సదస్సు-మార్చి 16, 2017**
**రాయలసీమకు చట్టబద్ధ నీటి హక్కులకై ఆమోదించిన తీర్మానాలు**

ప్రతిపాదనపత్రంలోని డిమాండ్లను సమావేశం నిశితంగా చర్చించి, పత్రంలోని డిమాండ్లకు క్రింద జతపరిచిన డిమాండును కూడ జతపరిచి, ఈ డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించడమైనది.

రాష్ట్రవిభజనకు ముందే నిర్మాణంలో వుండి 550 కోట్లు ఖర్చు పెట్టిన దుమ్ముగూడం-నాగార్జునసాగర్ టైల్ పాండ్ ప్రాజెక్టును కేంద్రప్రభుత్వమే జాతీయ ప్రాజెక్టుగా చేపట్టి, తద్వార గోదావరి నుండి కృష్ణానదికి మళ్లించడంవలన ఆదాఅయ్యే 165 టిఎంసిల కృష్ణాజలాలను రాయలసీమకు కేటాయించాలి.

ఈ డిమాండ్ల సాధనకు క్రింద వివరించిన కార్యక్రమాలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించడమైనది.

1. రాయలసీమ వ్యాప్తంగా మార్చి 31, 2017న రాయలసీమకు నీటి భిక్ష కాదు, చట్టబద్ధ నీటి హక్కులు కావాలని, పై డిమాండ్ల సాధనకు సత్యాగ్రహం చేయాలని తీర్మానించడమైనది.
2. అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచి, పై రాయలసీమ డిమాండ్ల సాధించుకొనడానికి మే 21, 2017న నంద్యాలలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయాలని తీర్మానించడమైనది.

(2వ కవరుపేజీ నుండి)
నాకు తెలియని విషయాల్ని మాత్రమే
అడుగుతున్నాను
ఇక...
ఇంట్లో అన్నాన్ని ఎలా పంచుకు
తింటారని అడిగినందుకు
మర్యాద తెలవదని రాళ్ళు రువ్వకండి
దేశమంటే ఒకే కుటుంబమనే భావన
సరైనదో కాదో తేల్చి చెప్పండి
వసుధైక కుటుంబమనే భావన వరకు
వెళ్ళొద్దులెండి
అందరి కోసమూ అడుగుతున్న ప్రశ్నలివి
రాయలసీమ గొంతు
సకల కరువుపీడిత ప్రాంతాలవారిదని
తెలపండి
కరువు గొంతు ఏ భాషదైనా
బాధ ఒకటే కదా!
కరువు కన్నీటిని పట్టించుకోనందుకు
అన్ని పార్టీలు అభినందనలు అందుకోండి

ఘనత వహించిన ప్రభుత్వాలు
అణువిస్ఫోటనాలు కల్పిస్తున్నందుకు
రాకెట్‌లు శాటిలైట్లు సృష్టిస్తున్నందుకు
మెచ్చుకోలు ఇవ్వాల్సిందే
సాగునీరుగాని, తాగునీరుగాని
తయారుచేసే ఫార్ములాని
కనిపెట్టారా అనడినందుకు
మూతి బిగదీయకండి


రాయలసీమలో
వజ్రాలు పుడతాయని మీకు తెలుసు
తరిమెల నాగిరెడ్డి అను వజ్రం కూడా
ఇక్కడే పుట్టిందని శ్రీశ్రీ చెప్పడం
తెలుసుకదా

అయితే, ఇక్కడ నీళ్ళు పుట్టవని
తెలియండి
ఇక్కడ పంటలు
నీళ్ళతో కాదు, రైతుల చెమటలతో
పండుతాయనే
నివేదికను నమ్మండి

ఈ దేశంలో వానలే కాదు
కరువులు, వరదలు కూడా
కృత్రిమంగా సృష్టిస్తారు అన్నందుకు
ప్రభుత్వాలు అరెస్టు వారంటులు
జారీచేస్తాయంటే నమ్మండి
నమ్మలేనివాళ్ళు గొంతుకలిపి చూడండి

మహాశయులారా!
నిద్రిస్తున్న అంతరాత్మల కింద
కొలిమిమంట పెట్టినందుకు క్షమించండి
మనం కలిసి జెండా పట్టేరోజు
రాకతప్పదనే విశ్వాసం
ప్రకటిస్తున్నందుకు
కలవరపడకండి
ఫరవాలేదు కాసేపు కునుకు తియ్యండి ★






AMAR



